క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
హైదరాబాద్
13-7-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 111
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# వివాదాల సురేఖ

## మళ్లీ చర్చనీయాంశంగా మారిన మంత్రి కొండా సురేఖ వ్యవహారశైలి

- కడియం శ్రీహరి సమీక్ష నిర్వహించడంపై అభ్యంతరం
- పరస్పరం విమర్శలు చేసుకున్న మంత్రి, ఎమ్మెల్యే
- యాదగిరిగుట్ట ట్రస్టు బోర్డు సభ్యుల ఎంపికపై
- మంత్రి సురేఖ తీవ్ర అభ్యంతరం • మంత్రివర్గ సమావేశానికీ గైర్హాజరు
- ముఖ్యమంత్రిని సంతృప్తిపరచని వివరణ

తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వ్యవహారం పై మరోసారి రాజకీయంగా చర్చ మొదలైంది. ఇటీవల కేబినెట్ సమావేశానికి ఆమె గైర్హాజరు కావడం, యాదగిరిగుట్ట ట్రస్టు బోర్డు సభ్యులను దేవాదాయ శాఖ మంత్రి అయిన తనకు తెలియకుండానే నియమించడం, మంత్రి చాంబర్ లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారులతో సమీక్ష నిర్వహించడం, దీనిపై సురేఖ, శ్రీహరి మధ్య పరస్పర విమర్శలు, సవాళ్లు జరగడం.. ఇలా వరుస పరిణామాలు చోటుచేసుకున్నాయి.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో** వీటితో మరోసారి కొండా సురేఖ–కొండా మురళి దంపతుల వ్యవహారశైలి కాంగ్రెస్ లో చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖ తన విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి తిరిగి వచ్చినప్పటికీ కేబినెట్ భేటీకి



2లో

### ముగిసిన ఎస్.జానకి

# అంత్యక్రియలు..

## అనంతలోకాలకు గానకోకిల

మైసూరులో ప్రభుత్వ లాంఛనాలతో ఎస్. జానకి అంత్యక్రియలు

హెచ్‌డీ కోటె తాలూకాలోని ఫామ్‌హౌస్‌లో ముగిసిన అంతిమ సంస్కారాలు

మహారాజా కాలేజీ గ్రౌండ్స్‌లో పార్థివదేహానికి నివాళులర్పించిన ప్రముఖులు

వేలాదిగా తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికిన అభిమానులు





# బిజెపిలోకి విజయసాయిరెడ్డి!

హిందుత్వవాదంతో గట్టి ప్రయత్నాలు

### కాషాయ పెద్దల ప్రాపకం కోసం ఆరాటం



**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. రోజుకో మలుపు తిరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ మాజీ నేత విజయసాయిరెడ్డి బిజెపిలో

2లో

# కిషన్ రెడ్డి క్రెడిట్ ఆరాటం!

## మెట్రో, మూసి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ ను కార్నర్ చేసే యత్నం

## సింగరేణి గనుల కేటాయింపు పై కొత్తగా ప్రచారం

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తెలంగాణలో క్రెడిట్ పాలిటిక్స్ నడుస్తున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్.. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మధ్య గడ్డి ఫైట్ ఉంటుంది. సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి, రాజకీయ వ్యూహాలతో కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని నిరంతరం డిఫెన్స్ లో పెడుతుంటారు. దానికి కౌంటర్ గా ఇప్పుడు కిషన్ రెడ్డి ఒక సరికొత్త పొలిటికల్ గేమ్ ను తెరపైకి తెచ్చారు. సింగరేణి సంస్థకు ఊపిరి పోసే విధంగా తాడిచర్ల బ్లాక్ 2 నో కేంద్ర ప్రభుత్వం కేటాయించిందంటూ ఆయన



2లో



# నేడు ఎంపీలతో సీఎం రేవంత్ భేటీ

### పార్లమెంటు వర్షాకాల భేటీ నేపథ్యంలో రాష్ట్ర ప్రాధాన్యతల గురించి వివరించనున్న ప్రభుత్వం

### మధ్యాహ్నం 3 గంటలకు అన్ని పార్టీల ఎంపీలతో భేటీ.. ఆపై కాంగ్రెస్ ఎంపీలతో డిన్నర్


హైదరాబాద్: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీలతో

# సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో కొత్త ఓపీడీ

### రేపు ప్రారంభించనున్న కేంద్ర మంత్రి మాండవీయ




హైదరాబాద్: ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) నిర్వహిస్తున్న సనత్‌నగర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక సదుపాయాలతో నిర్మించిన నూతన ఔట్ పేషంట్ డిపార్ట్‌మెంట



# మళ్లీ భగ్గుమన్న పశ్చిమాసియా

### నౌకలో 11 మంది భారతీయ నావికులు

10 మంది క్షేమం.. ఒకరి గల్లంతు

ఇరాన్‌పై మరోసారి విరుచుకుపడిన అమెరికా

140 ఇరాన్ సైనిక లక్ష్యాలు ధ్వంసం

అమెరికాపై ఇరాన్ ప్రతీకారం

బహ్రెయిన్, కువైట్, ఖతార్, ఒమన్‌లపై ఇరాన్ దాడులు

3లో

### విజయవాడలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు

# అగ్నికి ఆహుతి

విజయవాడ ఆటోనగర్‌లో భారీ అగ్నిప్రమాదం

అగ్నికి ఆహుతైన ఏడు ప్రైవేట్ బస్సులు

మెకానిక్ షెడ్‌లో మొదలైన మంటలు

ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్న అధికారులు

ఘటనపై కేసు నమోదు చేసి పోలీసుల దర్యాప్తు





2లో

# నీళ్లు అడిగితే రక్తం కావాలా?

రూ. ఏడు వేల కోట్లతో పోలవరాన్ని ముంచిన అధికారులతో మేడిగడ్డపై రిపోర్టులా?

పట్టిసీమకు నీళ్లు వదిలేసి గురువు చంద్రబాబుకు రేవంత్‌రెడ్డి గురుదక్షిణ

నన్ను జైల్లో వేసినా సరే.. నా ప్రాణం పోయినా సరే..

మోటార్లు ఆన్ చేసి రైతులను కాపాడండి

బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు

# కిషన్ రెడ్డి క్రెడిట్ ఆరాటం!

(మొదటి పేజీ తరువాయి)

చేసిన ప్రకటన ఇప్పుడు పెద్ద చర్చకు దారి తీసింది. రేవంత్ రెడ్డి వేస్తున్న మెట్రో, మూసి ప్రాజెక్టుల ప్రశ్నల నుంచి తప్పించుకోవడానికి.. తెలంగాణ అభివృద్ధికి తానే ముందుంటున్నానని మైలేజ్ కోసమే మంత్రి కిషన్ రెడ్డి సరికొత్త అస్త్రాన్ని ప్రయోగించారు అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**కాంగ్రెస్ భిన్న స్పందన..**

కిషన్ రెడ్డి ప్రకటన నేపథ్యంలో.. ఈ కేటాయింపు పై రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తో పాటు మరి కొందరు మంత్రులు, ఎంపీలు సానుకూలంగా స్పందించారు. అయితే పూర్తి వివరాలు పరిశీలించిన తర్వాత అసలు విషయాలు బయటకు వచ్చాయి. తాడిచర్ల 2 అనేది కిషన్ రెడ్డి ఇప్పుడు కొత్తగా కేటాయించిన బ్లాక్ కాదని.. దీనిని 2013లోనే సింగరేణి కేటాయించారని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. చాలా ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం రాస్తున్న లేఖల నేపథ్యంలో కేంద్రం కేవలం లీజు అనుమతిని మాత్రమే ఇప్పుడు మంజూరు చేసిందని గుర్తించారు. దానినే తానే కొత్తగా ఇచ్చినట్టు కిషన్ రెడ్డి ప్రచారం చేసుకోవడం కేవలం రాజకీయ ప్రయోజనాల కేనని కాంగ్రెస్ నేతలు కౌంటర్ ఇచ్చారు.

**బయటపడిన ద్వంద వైఖరి..**

అయితే సింగరేణి గనుల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి భిన్నంగా ఉంది. తాజాగా కిషన్ రెడ్డి ప్రకటనతో కేంద్ర ప్రభుత్వ ద్వంద్వ వైఖరి మరోసారి బయటపడింది అనే విమర్శలు వస్తున్నాయి. ఒకవైపు తాడిచర్ల బ్లాక్ లీజుకు అనుమతి ఇస్తూనే.. మరోవైపు గిరిజన చట్టాల పరిధిలోకి వచ్చే కోయగూడెం 3, మణుగూరు, సత్తుపల్లి వంటి సింగరేణి పరివాహక ప్రాంతాల్లోని బొగ్గు గనులను కేంద్రం వేలంపాటలో పెట్టడం.. సింగరేణి సమస్త ప్రయోజనాలకు గొడ్డలిపెట్టుగా మారింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి నిజంగా తెలంగాణ సింగరేణి పై ప్రేమ ఉంటే.. వివాదాస్పదమైన ఈ ప్రక్రియ పై సమీక్ష జరిపి తగిన సవరణలు చేయాలే తప్ప.. పాత కేటాయింపులను కొత్తగా చూపిస్తూ క్రెడిట్ కొట్టేయాలని చూడడం సరైన చర్య కాదు అని తెలంగాణవాదులు చెబుతున్నారు.

# బిజెపిలోకి విజయసాయిరెడ్డి!



(మొదటి పేజీ తరువాయి)

చేరేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఏడాది కిందట గుడ్ బై చెప్పిన ఆయన వ్యవసాయం చేసుకుంటానని చెప్పారు. కానీ ఆ పని చేయకుండా మళ్ళీ రాజకీయాలు మొదలుపెట్టారు. ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరుతానని కూడా గతంలో తేల్చి చెప్పారు. అయితే ఇప్పుడు బిజెపిలో చేరేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు ప్రచారం నడుస్తోంది.


**అభ్యంతరాలతోని..**

వైసీపీకి గుడ్ బై చెప్పిన తర్వాత ఆయన నేరుగా బిజెపిలో చేరుతారని అంతా భావించారు. కానీ తెలుగుదేశం పార్టీతో పాటు జనసేన నుంచి అభ్యంతరాలు రావడంతో కమలం పార్టీ నుంచి ఆయనకు గ్రీన్ సిగ్నల్ లభించలేదు. ఒకానొక దశలో సొంత పార్టీ పెడతారన్న ప్రచారం కూడా జరిగింది. ఆ విషయాన్ని ఆయన కూడా ప్రకటించారు. అవసరం అనుకుంటే కొత్త పార్టీని పెడతానని కూడా చెప్పుకొచ్చారు. కానీ ఆయన పార్టీకి ఏపీలో స్పేస్ లేదన్న విషయం ఆయనకి తెలుసు. అందుకే ఇప్పుడు బిజెపిలోకి వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టిన ట్లు తెలుస్తోంది. మొన్ననే జార్ఖండ్లో బిజెపి మద్దతుతో గెలిచారు రాజ్యసభ సభ్యుడిగా పరిమల్ నత్వాని. అయితే ఆయన గెలుపు వెనుక విజయసాయిరెడ్డి ఉన్నారన్న కామెంట్స్ వినిపించాయి. బిజెపికి దగ్గరవుతున్నారన్న టాక్ కూడా వచ్చింది.

**సుదీర్ఘ పోస్టులతో..**

తాజాగా ఏపీలో హిందుత్వ వాదాన్ని వినిపించారు విజయసాయిరెడ్డి. జోసెఫ్ రావణ్ అరెస్ట్, నటుడు ప్రకాష్ రాజ్ సమర్థన నేపథ్యంలో హిందూ ధర్మ రక్షణ, సనాతన సంప్రదాయాలంటూ సోషల్ మీడియాలో సుదీర్ఘమైన పోస్టులు పెడుతూ విజయసాయిరెడ్డి బిజెపికి దగ్గర అయ్యేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టినట్లు సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఇప్పటివరకు క్రిస్టియన్ అయిన జగన్మోహన్ రెడ్డి చంత ఉంటూ.. ఇప్పుడు అకస్మాత్తుగా హిందుత్వ వాదాన్ని ఎత్తుకోవడం వెనుక ఉన్న కారణం బిజెపికి దగ్గర కావడమే అన్న అనుమానం ఉంది. ఢిల్లీలో కేసుల సెగలు.. ఏపీలో అధికారం పోయేక వస్తున్న అరెస్టుల భయంతోనే విజయసాయిరెడ్డి బిజెపి పెద్దల దృష్టిలో పడేందుకు ఇలా కాషాయ వేషాలు వేయడం ప్రారంభించారని పొలిటికల్ వర్గాలు చెప్పుకొస్తున్నాయి. విజయసాయిరెడ్డి చేస్తున్న ఈ అతి హిందుత్వ రాజకీయం అటు బిజెపికి నమ్మకం కలిగించడం లేదని తెలుస్తోంది. ఇప్పట్లో ఆయనకు బిజెపిలో అవకాశం చిక్కే ఛాన్స్ లేదని సమాచారం. చూడాలి మరి ఏం జరుగుతుందో..

# వివాదాల సురేఖ




(మొదటి పేజీ తరువాయి)

హాజరుకాకపోవడం వెనుక బలమైన కారణాలే ఉండి ఉంటాయనే చర్చ కొనసాగుతోంది. ప్రధానంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ బోర్డు ఏర్పాటు ప్రక్రియకు సంబంధించిన వ్యవహారమే ఇందుకు కారణమని అంటున్నారు. విదేశీ పర్యటన నుంచి వచ్చిన అలసట కారణంగానే తాను కేబినెట్ భేటీకి హాజరు కాలేకపోయానంటూ కొండా సురేఖ వివరణ ఇచ్చినా అసలు కారణం మాత్ర వేరే ఉందన్న చర్చ జరుగుతోంది. తన శాఖకు సంబంధించిన అత్యంత కీలకమైన ఈ బోర్డు ఏర్పాటు విషయంలో దేవాదాయ శాఖ మంత్రిగా ఉన్న తన అభిప్రాయాలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదనే భావనతో ఆమె ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయంలో తీవ్ర అలకబూనిన కారణంగానే కొండా సురేఖ ఉద్దేశపూర్వకంగానే కేబినెట్ సమావేశానికి దూరంగా ఉన్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. యాదగిరిగుట్ట ట్రస్టు బోర్డు ఏర్పాటుపై కాగా, ఆలయ బోర్డు ఏర్పాటు విషయం పై తన సన్నిహితుల వద్ద తీవ్రస్థాయిలో ఆమె ఆగ్రహం వ్యక్తంచేసినట్టు తెలిసింది. దేవాదాయ శాఖ మంత్రినైన తనకు ఒక్కమాట కూడా చెప్పకుండానే నిర్ణయం తీసుకోవడంపై ఆమె మనస్తాపం చెందినట్టు చర్చ జరుగుతున్నది. ఇప్పటికే యాదగిరిగుట్ట ట్రస్టు బోర్డు ఏర్పాటుపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ప్రభుత్వంపై బహిరంగంగానే తన అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఆయన సీఎం రేవంత్‌రెడ్డిపైనే సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజగోపాల్‌రెడ్డికి తోడుగా కొండా సురేఖ సైతం బోర్డు ఏర్పాటు విషయంలో ఆగ్రహంతో ఉన్నారు. దీంతో.. ఇప్పుడు ఈ వ్యవహారం పైన రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయనేది కీలకంగా మారుతోంది.

**కడియం శ్రీహరి సమీక్షతో అగ్గి..**

కొండా దంపతులకు మొదటి నుంచీ వరంగల్ జిల్లాలోని కాంగ్రెస్ నేతలతో ఆధిపత్య పోరు కొనసాగుతోంది. గతంలో పలుమార్లు ఇది వివాదానికి దారితీసింది. పరస్పరం అధిష్ఠానానికి ఫిర్యాదు చేసేదాకా వెళ్లింది. తాజాగా మాజీ మంత్రి, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో మళ్ళీ వివాదం రేగింది. ఆయన హైదరాబాద్ లో దేవాదాయ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారని, తనకు లేని అధికారాన్ని ప్రదర్శించారని మంత్రి కొండా సురేఖ అగ్గిమీద గుగ్గిలమయ్యారు. అయితే తాను మంత్రి అధికారాల్లోకి చొరబడలేదని కడియం చెప్పారు. ఒక ఎమ్మెల్యేగా అధికారులకు తన నియోజకవర్గానికి సంబంధించి వినతులు ఇచ్చే హక్కు తనకు ఉంటుందని స్పష్టం చేశారు. పనిలో పనిగా.. మంత్రి సురేఖ అనవసరంగా అభద్రతా భావానికి గురవుతున్నారంటూ ఓ సెటైర్ కూడా వేశారు. అయినా సురేఖ ఇంతటితో ఈ విషయాన్ని వదల్లేదు. కడియం శ్రీహరికి దమ్ముంటే మంత్రి పదవి తెచ్చుకోవాలంటూ సవాల్ విసిరారు. అయితే కొండా సురేఖ సొంత పార్టీ నేతలకు సవాళ్లు చేయడం ఇదే తొలిసారి కాదు. గతంలోనూ జిల్లాలోని ఎమ్మెల్యేలందరిపైనా సురేఖ, ఆమె భర్త కొండా మురళి ఇద్దరూ ఇష్టారీతిన వ్యాఖ్యలు చేయడం, అవి పెద్ద దుమారం రేపడం తెలిసిందే. అంతకన్నా ముందు మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయాల పునర్నిర్మాణానికి సంబంధించి వ్యవహారం కూడా వివాదానికి దారితీసింది.

**మంత్రి పొంగులేటిపై వ్యాఖ్యలతో..**

మేడారం అమ్మవార్ల ఆలయ నిర్మాణాల ప్రగతిపై రెవెన్యూ మంత్రి అయిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించడం దేవాదాయ శాఖ మంత్రి అయిన కొండా సురేఖకు ఆగ్రహం తెప్పించింది. ఇది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి, ఆపై అధిష్టానం దృష్టికి కూడా వెళ్లింది. దీంతో అప్పట్లోనే సురేఖను మంత్రి పదవి నుంచి తొలగిస్తారనే ప్రచారం జరిగింది. అనంతరం మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ అంశం చర్చకు వచ్చినప్పుడల్లా సురేఖ పేరే ప్రథమంగా వినిపిస్తూ వస్తోంది. అంతేకాదు.. మంత్రి సురేఖ కుటుంబానికి సన్నిహితుడైన సుమంత్ అనే వ్యక్తి.. అరెస్టు విషయంలో రేగిన వివాదం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితోనూ విభేదాలకు దారితీసింది. సురేఖ కూతురు సుష్మిత చేసిన ఆరోపణలు పెను దుమారం రేపాయి. ఇది ఎలాగోలా సమసిపోయినా.. సురేఖ వ్యవహారశైలి మాత్రం అలాగే కొనసాగుతోంది. అయితే తాజా వివాదాలు కూడా అలాగే ముగిసిపోతాయా? కొండా దంపతుల రాజకీయ భవిష్యత్తు కు సవాలుగా మారతాయా? అన్నది తేలాల్సి ఉంది.

# నేడు ఎంపీలతో

ప్రభుత్వం సమావేశం నిర్వహిస్తోంది. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రజాభవన్‌లో జరిగే ఈ భేటీకి హాజరు కావాలని అన్ని పార్టీలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు ఆహ్వానం అందింది. కేంద్ర ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్న అంశాలు, పలు ప్రాజెక్టులకు రావాల్సిన నిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతల గురించి ఈ సమావేశంలో ఎంపీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వివరించనున్నారు. అన్ని పార్టీల భేటీ అనంతరం కాంగ్రెస్ ఎంపీలతో సీఎం డిన్నర్ భేటీ కానున్నారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై సీబీఐ విచారణ, మెట్రో రైలు, ఉపాధి హామీ పథకం అమలులో కేంద్ర వైఖరి తదితర అంశాలపై పార్టీ ఎంపీలు అనుసరిచాల్సిన వైఖరి గురించి సీఎం రేవంత్ కాంగ్రెస్ ఎంపీలకు దిశానిర్దేశం చేయనున్నారు. పార్లమెంటులో ఏ ఎంపీ ఏ అంశంపై మాట్లాడాలనే పని విభజన చేయనున్నారు.

# ముగిసిన ఎస్.జానకి అంత్యక్రియలు..



ప్రముఖ గాయని, 'గాన కోకిల' ఎస్. జానకి అంతిమ యాత్ర ముగిసింది. ఆదివారం ఆమె అంత్యక్రియలు కర్ణాటక ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జరిగాయి. మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకాలోని ఆమె వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యులు, అభిమానుల అశ్రు నయనాల మధ్య తుది సంస్కారాలు నిర్వహించారు. జానకమ్మ మనవరాలు అప్సర వైద్యుల తుది కర్మలు జరిపించారు. అంతకుముందు, జానకమ్మ పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం మైసూరులోని మహారాజా కాలేజీ గ్రౌండ్స్‌లో ఉంచారు. తమ అభిమాన గాయనిని కడసారి చూసేందుకు అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖులు వేలాదిగా తరలివచ్చారు. భారతీయ సంగీతానికి ఆమె చేసిన సేవలను గౌరవిస్తూ, పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు.వయో సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న 88 ఏళ్ల జానకి, శనివారం మైసూరులోని అపోలో ఆసుపత్రిలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన అద్భుత ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ సహా 20కి పైగా భాషల్లో 48,000కు పైగా పాటలు పాడి ఆమె చరిత్ర సృష్టించారు. ఆమె విశిష్ట గాత్రానికి నాలుగు జాతీయ పురస్కారాలు కూడా లభించాయి.జానకి మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సంగీత దర్శకుడు ఇళయరాజా సహా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భౌతికంగా దూరమైనా, తన గాత్రంతో ఎప్పటికీ జీవించే ఉంటారని అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు.

### విజయవాడలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు

# అగ్నికి ఆహుతి



నగరంలోని ఆటోనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో ఏడు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. మరమ్మతుల కోసం మెకానిక్ షెడ్‌లో నిలిపి ఉంచిన బస్సులకు మంటలు అంటుకోవడంతో ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే, ఆటోనగర్‌లోని ఓ మెకానిక్ షెడ్‌లో మరమ్మతుల కోసం ఒక బస్సును నిలిపారు. ఆ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే పక్కన పార్క్ చేసి ఉన్న మిగతా ఆరు బస్సులకు కూడా మంటలు వేగంగా వ్యాపించాయి. పెద్ద ఎత్తున అగ్నికీలలు ఎగిసిపడటాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే మూడు ఫైర్ ఇంజన్లు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు జరగకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే, ఏడు బస్సులు పూర్తిగా దగ్ధమవడంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందా లేక మరేదైనా కారణం ఉందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.

# సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిలో కొత్త ఓపీడీ



(ఓపీడీ)ను కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మంగళవారం ప్రారంభించ నున్నారు. రూ. 211.13 కోట్ల వ్యయంతో 43,611.04 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన ఈ ఓపీడీ విభాగంలో జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, డెంటల్, గైనకాలజీ, కంటి చికిత్స, ఆర్థోపెడిక్స్, సైకియాట్రీ, చర్మ వ్యాధులు, ఊపిరితిత్తుల వ్యాధులు, పీడియాట్రిక్స్, జనరల్ సర్జరీ, ఆయుష్ ఉప విభాగాలున్నాయి. అలాగే ఫిజియోథెరపీ, రేడియాలజీ, యోగా విభాగాలు కూడా పనిచేస్తాయి. 60 పడకల వార్డులు మూడు ఉండగా... ఈ మూడింట్లో 180 సాధారణ పడకలున్నాయి. 25 ఐసీయూ, 20 ఎన్‌ఐసీయూ పడకలు, మందుల దుకాణం, క్లినికల్ లెక్చర్ థియేటర్ కూడా ఏర్పాటు చేశారు. హైదరాబాద్ జంట నగరాల్లోని కారి?మక కుటుంబాలకు వైద్య సేవలు అందిస్తున్న సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రి 1975 మార్చి 30న ప్రారంభమైంది. ప్రస్తుతం ఈఎస్ఐసీ 2.0 సంస్కరణల కింద రాష్ట్రంలోని 33 జిల్లాలకూ ఈఎస్ఐ సేవలు అందుతున్నాయి. సామాజిక భద్రత కింద మొత్తం 19,15,700 మంది ఈఎస్ఐ చందాదారులు, 74,32,916 మంది లబ్ధిదారులకు సేవలు అందుకుంటున్నారు. సనత్‌నగర్ ఈఎస్ఐసీ ఆస్పత్రి ఓపీడీ విభాగాన్ని ప్రారంభించిన తర్వాత అక్కడి నుంచే వర్చువల్‌గా ఏపీలోని రాజమహేంద్రవరంలో ఈఎస్ఐ ఆస్పత్రి (26 ఓపీడీ గదులు, 3 ఆధునిక మాడ్యులర్ థియేటర్లు) సహా మరో ఐదు రాష్ట్రాల్లో ఆరు ఈఎస్ఐ ప్రాజెక్టులను మన్‌సుఖ్ మాండవీయ ప్రారంభిస్తారు.

# మళ్లీ భగ్గుమన్న పశ్చిమాసియా

దుబాయ్: పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. దాడులు, ప్రతిదాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం తెల్లవారుజామున ఒమన్ తీరంలో హార్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌక 'జీఎఫ్ఎస్ గెలాక్సీ'పై ఇరాన్ సైన్యం దాడికి దిగింది. ఆ సమయంలో నౌకలో మొత్తం 11 మంది భారతీయ నావికులు ఉన్నారు. వారిలో 10 మందిని రక్షించగా, ఒకరు గల్లంతయ్యారు. అతడి ఆచూకీ ఇంకా తెలియరాలేదు. ఈ ఘటనలో మొత్తంగా 23 మందిని కాపాడారు. వాణిజ్య నౌకపై ఇరాన్ దాడిని భారత ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. గల్లంతైన నావికుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో వెల్లడించింది. మస్కట్‌లోని ఒమన్ అధికారులతో కలిసి ఇండియన్ ఎంబసీ గాలింపు చర్యలను సమీక్షిస్తోంది. ఇరాన్ దాడిలో నౌక వెంటనే మంటల్లో చిక్కుకుంది. హార్మూజ్ జలసంధిని మరోసారి మూసివేసినట్లు ప్రకటించడానికి కొద్దిసేపటి ముందు హెచ్చరికగా జరిపిన దాడికి ఇరాన్ అభివర్ణించింది. ఈ దాడిలో సైప్రస్ జెండా కలిగిన జీఎఫ్ఎస్ గెలాక్సీ నౌక అగ్గి?నకి ఆహూతయ్యింది. హార్మూజ్‌లో అది అనుమతి లేని మార్గంలో ప్రయాణిస్తోందని ఇరాన్ పేర్కొంది. ఈ ఘటన పట్ల ఎవరైనా ప్రతీకార చర్యకు దిగితే తమ ప్రతిస్పందన తీవ్రస్థాయిలో ఉంటుందని హెచ్చరించింది. మరోవైపు జీఎఫ్ఎస్ గెలాక్సీపై జరిగిన దాడిని కారణంగా చూపుతూ అమెరికా సైన్యం ఇరాన్‌పై మరో విడత దాడులు చేపట్టింది. ఈ వారంలో ఇరాన్ లక్ష్యాలపై అమెరికా జరిపిన దాడుల్లో ఇది మూడోది. ఆదివారం తెల్లవారుజామున ఇరాన్‌లోని సుమారు 140 సైనిక లక్ష్యాలపై అమెరికా దాడులుచేసింది. ఇరాన్ క్షిపణి, డ్రోన్ స్థావరాలు, నౌకాదళ సామర్థ్యాలు, మందుగుండు సామగ్రి నిల్వ సౌకర్యాలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు, తీరప్రాంత నిఘా కేంద్రాలపై దాడులు చేశామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఆదివారం వెల్లడించింది. ఇరాన్‌లోని అత్యంత కీలకమైన ఖెష్మ్ దీవిపై ఆదివారం మధ్యాహ్నం నుంచి వరుస దాడులు జరుగుతున్నట్లు సమాచారం. ఇరాన్ అధికార వార్తా సంస్థ ఈ విషయం ప్రకటించింది. దీవిలోని సైనిక లక్ష్యాలపై కనీసం డజను దాడులు జరిగినట్లు తెలిపింది.

**ఇరాన్ ప్రతిదాడులు**

అమెరికా తాజా దాడుల పట్ల ఇరాన్ వెంటనే ప్రతిచర్యకు దిగింది. ఆదివారం ఉదయం బహ్రెయిన్, కువైట్, ఖతార్, యూఏఈ, ఒమన్‌లపై వైమానిక దాడులకు దిగింది. అమెరికా సైనిక స్థావరాలు, మౌలిక సదుపాయాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లు ప్రయోగించింది. ఇరాన్ ప్రయోగించిన పలు క్షిపణులను మార్గమధ్యంలోనే అడ్డుకున్నట్లు ఖతార్ సైన్యం ప్రకటించింది. పొరుగున ఉన్న యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఖతర్‌లో ఇరాన్ దాడులను అడ్డుకునే క్రమంలో పడిన గగనతల రక్షణ వ్యవస్థ శకలాల కారణంగా ఒక చిన్నారితో సహా ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు. ఇరాన్ క్షిపణులను మధ్యలోనే ధ్వంసం చేశామని కువైట్ వెల్లడించింది. అమెరికా దూకుడుపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బఘేర్ గాలిబాఫ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. నౌకలు అనుమతి లేని మార్గాల్లో ప్రయాణిస్తున్నాయని ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఆరోపించింది. వాటిలో ఒకనౌకపై ముందస్తు హెచ్చరికగా కాల్పులు జరపాల్సి వచ్చిందని తెలిపింది. హార్మూజ్‌ను మూసేశామని పేర్కొంది. అయితే హార్మూజ్ తెరచే ఉందని అమెరికా పేర్కొంది.

**వచ్చేవారం జనం ముందుకు మొజ్తబా!**

ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ వచ్చేవారం ప్రజల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తోంది. దివంగత సుప్రీంలీడర్ అయతొల్లా అలీ ఖమేనీ సంస్మరణ సభను వచ్చేవారం నిర్వహించబోతున్నట్లు ఇరాన్ ప్రభుత్వం వెల్లడించింది. ఈ నెల 23న సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల దాకా ఈ సభ జరగనుంది. అయితే, ఈ కార్యక్రమానికి మొజ్తబా హాజరవుతారా? లేదా? అనే దానిపై ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు.

**నౌకలపై ఎలాంటి ఆంక్షలు వద్దు: భారత్**

హార్మూజ్‌లో వాణిజ్య నౌకలపై దాడులు జరుగుతుండటంపై భారత విదేశాంగ శాఖ ఆందోళన వ్యక్తంచేసింది. ఉద్రిక్తతలను తక్షణమే తగ్గించాలని, ఆ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం తిరిగి నెలకొనేలా దౌత్యపరమైన పరిష్కారం కోసం జరుగుతున్న చర్చలను విజయవంతంగా ముగించాలని విన్నవించింది. హార్మూజ్‌లో నౌకలపై ఎలాంటి ఆంక్షలు విధించరాదని స్పష్టంచేసింది. వాణిజ్య నౌకాయానం, పౌర మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోవడం వెంటనే ఆపాలని పేర్కొంది. అంతర్జాతీయ చట్టానికి అనుగుణంగా అంతర్జాతీయ జలమార్గాల ద్వారా స్వేచ్ఛాయుతమైన. నిరాటంకమైన నౌకాయానం, వాణిజ్యాన్ని వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని కోరింది.

## హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఫెరారీ కారు బీభత్సం

**జూబ్లీహిల్స్‌లో అపార్ట్‌మెంట్ గేటును ఢీకొట్టిన ఫెరారీ కారు**

**ప్రమాదం తర్వాత కారును వదిలేసి పరారైన వ్యక్తులు**

**మద్యం మత్తులో అతివేగమే కారణమని పోలీసుల ప్రాథమిక అనుమానం**

**వారంలోపే ఇదే ప్రాంతంలో ఇది రెండో రోడ్డు ప్రమాద ఘటన**

**సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా వ్యక్తుల కోసం గాలిస్తున్న పోలీసులు**

హైదరాబాద్‌లోని సంపన్నులు నివసించే జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున ఓ లగ్జరీ కారు బీభత్సం సృష్టించింది. వేగంగా దూసుకొచ్చిన ఫెరారీ కారు అదుపుతప్పి ఓ అపార్ట్‌మెంట్ గేటును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, అయితే కారులో ఉన్నవారు దానిని అక్కడే వదిలేసి పరారయ్యారని అధికారులు తెలిపారు. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 5లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఫోర్ట్ వ్యూ అపార్ట్‌మెంట్స్ గేటును కారు ఢీకొట్టడంతో అది పూర్తిగా ధ్వంసమైంది. సుమారు రూ. 3.50 కోట్లకు పైగా విలువ చేసే ఫెరారీ రోమా కారు ముందు భాగం కూడా నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్, అందులోని ఇతర వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మద్యం మత్తులో అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.

## నీళ్లు అడిగితే రక్తం కావాలా?

హైదరాబాద్: రైతులు సాగునీరు అడిగితే రక్తం కావాలంటూ మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన నరహంతకుడికి పెద్దగా తేడా కనిపించడం లేదని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. ప్రతిపక్షాల రక్తాన్ని పంటలపై చల్లాలని, బెల్టుతో కొట్టాలని ఒక ముఖ్యమంత్రి మాట్లాడటం అత్యంత జుగుప్సాకరమని మండిపడ్డారు. హిట్లర్‌ను ఆదర్శంగా చెప్పుకునే రేవంత్ అదే తరహా హంతక భాష మాట్లాడుతున్నారని ఆరోపించారు. రైతుల పంటలను కాపాడాల్సిన ప్రభుత్వం ఈగోతో కన్నెపల్లి, దేవాదుల మోటార్లను నిలిపివేసి రాష్ట్రాన్ని కరువు వైపు నెడుతోందన్నారు. తనను జైల్లో వేసినా, తన ప్రాణం పోయినా అభ్యంతరం లేదని, కానీ వెంటనే మోటార్లు ఆన్ చేసి రైతులను ఆదుకోవాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

**గోదావరిలో నీళ్లు ఉన్నా ఎత్తడం లేదు**

గోదావరిలో ప్రస్తుతం లక్ష క్యూసెక్కులకు పైగా వరద ప్రవహిస్తున్నా ప్రభుత్వం కావాలనే నీటిని ఎత్తడం లేదని హరీశ్ ఆరోపించారు. మేడిగడ్డ గేట్లు మూయకుండానే కన్నెపల్లి మోటార్లు నడపొచ్చని, ఇదే విషయాన్ని నిపుణులు, రిటైర్డ్ ఇంజనీర్లు, ఇరిగేషన్ అధికారులు కూడా ప్రభుత్వానికి స్పష్టం చేశారని తెలిపారు. కేవలం రూ. 8.5 కోట్లతో కాఫర్ డ్యామ్ నిర్మించి నీటిని ఎల్లంపల్లికి తరలించొచ్చని అధికారులు సూచించినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై చేసిన దుష్ప్రచారం బయటపడుతుందనే భయంతోనే మోటార్లు ఆన్ చేయడం లేదని విమర్శించారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకొచ్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, ఇప్పుడు నీటిని ఎత్తకపోతే ఎన్టీపీసీ, సింగరేణి, హైదరాబాద్ తాగునీటి అవసరాలు దెబ్బతినడంతోపాటు థర్మల్ విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మేడిగడ్డపై నివేదిక ఇచ్చిన ఎన్‌డీఎస్ఏ అధికారులే పోలవరం ప్రాజెక్టులో రూ.వేల కోట్ల నష్టానికి బాధ్యులని హరీశ్ ఆరోపించారు. కేసీఆర్ హయాంలోనే

**వ్యవసాయ విప్లవం**

కాంగ్రెస్ పాలనలో 6.64 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందగా, బీఆర్ఎస్ హయాంలో 48.74 లక్షల ఎకరాలకు నీరందించామని హరీశ్ పేర్కొన్నారు. దేవాదులలో పూర్తిస్థాయిలో మోటార్లు నడపకుండా, గోదావరి జలాలను కిందకు వదిలి పట్టిసీమకు మేలు చేస్తూ సీఎం తన రాజకీయ గురువు చంద్రబాబుకు గురుదక్షిణ ఇస్తున్నారని ఆరోపించారు. రైతుల ప్రయోజనాల కంటే రాజకీయ కక్షలకు ప్రాధాన్యం ఇవ్వొద్దని, వెంటనే కన్నెపల్లి, దేవాదుల మోటార్లను పూర్తిస్థాయిలో ప్రారంభించాలని డిమాండ్ చేశారు.




## బాబుల్‌రెడ్డి నగర్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ నమోదు కార్యక్రమం

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డి నగర్, మార్కండేయ నగర్ ప్రాంతాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శ్రీ మేధా స్కూల్ ఆవరణలో, గాంధీ విగ్రహం సమీపంలో ఎన్యూమరేషన్ ఫారమ్‌ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీఎల్ఓ అధికారులు, బీఎల్ఏల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులైన ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకుని ప్రత్యేక సవరణ ప్రక్రియను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు సోమ శ్రీనివాస్ గుప్తా, ఉమ్మడి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు దనంజయ్య, మాజీ అధ్యక్షుడు సిరికొండ వెంకటేష్, కిషోర్, హనుమంత్, మల్లేష్ (పోతురాజ్), సురేష్, జగన్, ఓం ప్రకాష్, ఓరుగంటి మల్లేష్, సోమ సందీప్ గుప్తా, ఏటీ నాగరాజ్, రవి ముదిరాజ్, డి. కృష్ణ, రవి పూజారి, మల్లేష్, ఆకుల శ్రీనివాస్, అస్మా, శోభ, జే. వెంకటయ్యతో పాటు బీఎల్ఓలు, జీహెచ్ఎంసీ అధికారులు, బీఎల్ఏలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## పిఏసీఎస్ డైరెక్టర్లకు సన్మానం

**మా కూరెళ్ల గ్రామంపై నమ్మకం ఉంచి డైరెక్టర్లుగా నియమించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి కృతజ్ఞతలు**



**ఆత్మకూరు(ఎం),జూలై12/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం మొన్న నియామకమైన పిఏసీఎస్ ఆత్మకూరు(ఎం) మండల పాలకమండలిలో కూరెళ్ళ గ్రామం నుంచి డైరెక్టర్లుగా భాష బోయిన సత్యనారాయణ,కూరెల్ల యాదమ్మలకు అవకాశం కల్పించిన ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి, పిఏసీఎస్ చైర్మన్ యాస లక్ష్మారెడ్డికి,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కందడి అనంతరెడ్డికి, తాజామాజీ వైస్ ఎంపీపీ భాషపోయిన పద్మ పాపయ్యకి, కూరెళ్ళ గ్రామం సర్పంచ్ భాష బోయిన చంద్రమ్మ ఎల్లయ్యకి, గణగాన్ శ్రీనివాస్,ఐదో వార్డ్ మెంబర్ భాష బోయిన లింగం, బెజ్జంకి బిక్షం,ఉప్పల నరసింహ, నార్కటపెల్లి సహా దేవులు, తదితరులకు,కూరెళ్ల గ్రామ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.

## సర్ సందేహాలను నివృత్తి చేస్తున్న హెల్ప్ డెస్క్

**బి ఎల్ ఓ ల సేవలను కొనియాడుతున్న ఓటర్లు**

బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) ఓటరు నమోదు ప్రక్రియ సజావుగా సాగేలా చూడడంలో హెల్ప్ డెస్క్ పాత్ర అత్యంత కీలకమని ఎన్యుమరేషన్ ఫామ్ నింపడంలో వీరి సహాయం కీలకంగా మారిందని మీర్పేట్ లోని సత్యం పాఠశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ లో పాల్గొన్న ప్రజలు తెలుపుతూ అధికారులు ఆదివారం నాడు కూడా వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. సత్యం స్కూల్లో ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్ లో స్థానిక ప్రజలు తమ ఎన్యుమరేషన్ ఫామ్ తీసుకొని వచ్చిన వారికి వారి సందేహాలను నివృత్తి చేస్తూ ఎన్యుమరేషన్ ఫామ్ నింపే ప్రక్రియను సులభతరంగా నిర్వహించారు. హెల్ప్ డెస్క్ లో బిఎల్వోలు సరిత, వైశాలి, సబిత, తరుణ్, జాహ్నవి, ప్రియాంక, అజయ్, ధరంకర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



## షాబాద్ ఆరు హత్యల కేసు.. కిరాతకుడు రాజ్‌కుమార్ ఆచూకీపై వీడని సస్పెన్స్!

- షాబాద్‌లో ఆరుగురిని హత్య చేసిన నిందితుడు రాజ్‌కుమార్ పరారీ
- ఆత్మహత్య చేసుకోలేదని, రైలెక్కి పారిపోయాడని నిర్ధారించిన పోలీసులు
- నిందితుడి కోసం 10 ప్రత్యేక బృందాలతో ముమ్మర గాలింపు
- ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించినందుకు షాబాద్ ఎస్సై సస్పెన్షన్
- పోక్సో కేసులో కక్ష పెంచుకునే ఈ ఘోరానికి పాల్పడినట్లు వెల్లడి



గీరంగారెడ్డి జిల్లా షాబాద్‌ను ఉలిక్కిపడేలా చేసిన ఆరుగురి వరుస హత్యల కేసులో నిందితుడు రాజ్‌కుమార్ ఆచూకీ ఇప్పటికీ లభించలేదు. అతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడన్న అనుమానాలను పటాపంచలు చేస్తూ, పక్కా ప్రణాళికతోనే రైలెక్కి పారిపోయాడని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని పట్టుకునేందుకు సుమారు 10 ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి, గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఘోర హత్యాకాండకు పాల్పడిన తర్వాత రాజ్‌కుమార్ తన తండ్రికి ఫోన్ చేసి చనిపోతానని చెప్పడంతో అతను ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని మొదట భావించారు. అయితే, నందిగామ సమీపంలో నిందితుడి కారును, మొబైల్ సిగ్నల్‌ను పోలీసులు గుర్తించారు. అక్కడి సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించగా, అతను కారును వదిలేసి నందిగామ రైల్వే స్టేషన్ వైపు వెళ్లినట్లు స్పష్టమైంది. దీంతో రైల్వే స్టేషన్‌లోని దృశ్యాలను విశ్లేషిస్తున్న పోలీసులు, అతను ఆత్మహత్య చేసుకోలేదని, తప్పించుకునేందుకే రైలు మార్గాన్ని ఎంచుకున్నాడని తేల్చారు.

**పోలీసుల నిర్లక్ష్యమే కొంపముంచిందా?**

ఈ దారుణానికి పోలీసుల నిర్లక్ష్యమే కారణమని బాధితుల కుటుంబ సభ్యులు, స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. గతంలో ఓ మైనర్ బాలికను వేధించిన కేసులో పోక్సో చట్టం కింద అరెస్టయిన రాజ్‌కుమార్, జైలు నుంచి విడుదలయ్యాక కక్ష పెంచుకున్నాడు. 'మీ అంతు చూస్తా' అంటూ బాధితుల కుటుంబాన్ని బెదిరించాడు. ఈ విషయంపై వారు స్థానిక పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కన్నీరుమున్నీరవుతున్నారు. "అతడే భయపడుతున్నాడు. మీరేం కంగారు పడొద్దు" అని కేసు దర్యాప్తు అధికారి అయిన ఎస్సై రమేశ్ తేలిగ్గా తీసిపారేసినట్లు బాధితులు వాపోతున్నారు. వారి ఫిర్యాదులను తీవ్రంగా పరిగణించని కారణంగానే శనివారం ఈ ఘోరం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడు మొదట బాలిక, ఆమె తల్లి, నానమ్మను దారుణంగా నరికి చంపి, ఆ తర్వాత తన భార్య, ఇద్దరు పిల్లలను కూడా హతమార్చాడు. ఈ ఆరోపణల నేపథ్యంలో విధి నిర్వహణలో నిర్లక్ష్యం.


GHMC
hmda Growing Global
TS-bPASS

MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com

SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions

వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.

H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# ఈటెల వ్యూహం ఏమిటీ



**బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలు పార్టీలో చర్చనీయాంశమయ్యాయి. తనకు తెలంగాణ రాష్ట్రం ముఖ్యమని, ఆ తర్వాతే పార్టీ అని, ఆ తర్వాతే వ్యక్తిగతమని ఆయన చేసిన వ్యాఖ్యలు పార్టీలో లోతైన చర్చకు కారణమయింది. ఈటల రాజేందర్ మావోయిస్టుల నుంచి రాజకీయాల్లోకి వచ్చారు.**

ఆయన తెలంగాణ రాష్ట్ర ఉద్యమం నుంచి బీఆర్ఎస్ లో పనిచేశారు. బీఆర్ఎస్ ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నప్పటికీ ఆయన తనదైన ముద్రను వేసుకున్నారు. బీసీ నేతగా ఉన్న ఈటల రాజేందర్ తొలి నుంచి వివాదాలకు దూరంగా ఉన్నారు. అయితే బీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ తో పొసగకపోవడంతో పాటు ఆయన వైఖరిని వ్యతిరేకించడంతో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు.. దీంతో ఈటల రాజేందర్ ఈటల రాజేందర్ బీజేపీ లో చేరారు. హుజారాబాద్ లో ఓటమి పాలయినా 2024 ఎన్నికల్లో ఈటల రాజేందర్ మల్కాజ్ గిరి నుంచి బీజేపీ తరుపున పోటీ చేసి ఎన్నికయ్యారు. అయితే సామాజికవర్గం కోటాలతోతనకు మంత్రి పదవి లభిస్తుందని ఆశించారు. కానీ రాకపోవడంతో పాటు తాను గతంలో ప్రాతినిధ్యం వహించిన హుజూరాబాద్ కు మాత్రం ఆయనను దూరం చేయడంతో పాటు పార్టీలో సరైన ప్రాతినిధ్యం కల్పించకపోవడంతో కొంత ఈటల రాజేందర్ ఇబ్బందులు పడుతున్నారని గతంలోనూ ప్రచారం జరిగింది. అయితే తిరిగి బీఆర్ఎస్ లో చేరతారన్న ప్రచారాన్ని డు ఈటల రాజేందర్ కొట్టిపారేశారు. కానీ ఇటీవల ఒక వివాహ వేడుకలో మాజీ మంత్రి కేటీఆర్ ను కలవడం, ఆయన కుటుంబ సభ్యులతో కలసి మాట్లాడటంతో మరొకసారి ఈ ప్రచారం ఊపందుకుంది. కానీ ఈటల రాజేందర్ మాత్రం తాను బీజేపీలోనే కొనసాగుతానని చెబుతున్నారు. కానీ ఆయన ఉన్నట్లుండి తనకు తెలంగాణ ముఖ్యమని ఎందుకన్నారు? పార్టీ తర్వాతేనని అన్న మాటకు అర్థం ఏంటన్న దానిపై కూడా బీజేపీ రాష్ట్ర నేతలు ఆరా తీస్తున్నారు. ఈటల బీజేపీలో ఇమడలేకపోతున్నారన్న చర్చ జోరుగా సాగుతోంది. మొదట తనకు మంత్రిగా అవకాశం వస్తుందనుకున్నారు. ఆ తర్వాత బీజేపీ అధ్యక్ష పదవి దక్కుతుందన్న ప్రచారం జరిగినా, ఎప్పటికప్పుడు చెక్ పెడుతూ వచ్చారు తన వైరి వర్గం నేతలు. ఆ తర్వాత కొంత సైలెంట్ గా ఉన్నా, కాళేశ్వరం విషయంలో ఈటల రాజేందర్ దూకుడుగా మాట్లాడుతున్న తీరు ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ వద్ద ఉన్న కన్నేపల్లి పంప్ హౌజ్ నుండి వాటర్ లిఫ్టింగ్ పై కొంతకాలంగా కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. బీజేపీ దాదాపు సైలెంట్ గా ఉన్నా, ఈటల మాత్రం వాయిస్ బీఆర్ఎస్ కు అనుకూలంగా పెంచుతూ వస్తున్నారు. అవినీతి వల్ల మేడిగడ్డ కుంగింది, వాటర్ లిఫ్టింగ్ సాధ్యం కాదని సీఎం రేవంత్, ప్రభుత్వం వాదిస్తుంటే... వాటర్ లిఫ్టింగ్ సాధ్యమేనని బీఆర్ఎస్ వాదిస్తుంది. బీఆర్ఎస్ వాదనను ఎంపీ ఈటల స్ట్రాంగ్ గా సపోర్ట్ చేస్తూ వస్తున్నారు. అవినీతి విషయంలో, అరెస్టుల విషయంలోకి నేను రాను. కానీ కన్నేపల్లి వద్ద ప్రభుత్వం రాజకీయంగా చూస్తూ వాటర్ లిఫ్ట్ చేయటం లేదన్నది ఈటల వాదన. తాను ఎవరో మాట్లాడిస్తే మాట్లాడే వాడిని కాదని, తెలంగాణ మట్టిబిడ్డను, ఉద్యమకారుడిని కాబట్టి అడుగుతున్నా. రైతుల కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటానంటూ ఈటల మరోసారి స్పందించారు. ఇటీవల మాజీ ఎంపీ వినోద్ కొడుకు పెళ్లిలో కేటీఆర్ దంపతులతో ఈటల ఉన్న వీడియోలు వైరల్ కావటం, ఇప్పుడు ఉద్యమకారుడిని అంటూ చెప్తూనే కాళేశ్వరం విషయంలో బీఆర్ఎస్ వాదనతో ఏకీభవించటం, బీజేపీలో ఉన్న గ్రూప్ రాజకీయాలను చూస్తుంటే... ఈటల మనసు మారుతోందా? అన్న అనుమానాలు బలపడుతున్నాయని, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు- శాశ్వత మిత్రులు ఉండరన్న విషయం మర్చిపోరాదని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. యాధృచ్ఛకంగా అన్న మాటలేనా? లేక ఇందులో ఏదైనా అంతరార్థం ఉందా? అన్న అనుమానాలు కూడా ఉన్నాయి. అయితే ఆయన బీఆర్ఎస్ లో చేరనని చెప్పడంతో బీజేపీలోనే కొనసాగుతూ తన అసంతృప్తిని వెళ్లగక్కే అవకాశముందని కూడా అంటున్నారు. తనను కేవలం ఒక ప్రాంతానికే పరిమితం చేయడంపైన కూడా ఈటల రాజేందర్ గుర్రుగా ఉన్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాల కోసం ఎంత వరకైనా పోరాడాతానని ఈటల అనడం పైనా కూడా సోషల్ మీడియాలో వివిధ కామెంట్స్ వినపడుతున్నాయి. ఇప్పటికే బండి సంజయ్, కిషన్ రెడ్డిలతో ఈటల రాజేందర్ కు అంత

# క్షణభంగుర జీవనంలో... శాశ్వత ముద్రలు!

**జీవితం అంటే ఏమిటి? ఈ ప్రశ్నకు ఎవరికి తోచిన సమాధానం వారికుంటుంది. కానీ ఒక్క మాటలో చెప్పాలంటే, జీవితం ఒక సుదీర్ఘమైన ప్రయాణం కాదు అది ఒక చిన్న మజిలీ మాత్రమే. పుట్టుక నుండి మరణం వరకూ మధ్యలో మనం ఆగే ఈ కొద్దిపాటి కాలం, విశ్వం అనే అనంత ప్రవాహంలో ఒక చిన్న విరామం లాంటిది. ఈ సత్యాన్ని గుర్తించినవాడు మాత్రమే జీవితాన్ని నిజమైన అర్థంతో జీవించగలడు. ఎందుకంటే, ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోయే క్షణం ఎప్పుడో ఒకప్పుడు తప్పకుండా వస్తుంది.**



అయితే ఆ నిష్క్రమణ భయపెట్టేది కాదు, అది జీవితానికి ఒక అర్థాన్ని, ఒక తీవ్రతను ఇచ్చే వాస్తవం. మనం జీవించే ఈ సమాజంలో ప్రతి ఒక్కరూ పరుగుల లంకెలోనే ఉన్నారు. ఉదయం లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు ఏదో ఒక అన్వేషణ, ఏదో ఒక ఆరాటం. కానీ ఈ పరుగులో మనం అసలైన జీవితాన్ని ఆస్వాదించడం మర్చిపోతున్నామా అనే సందేహం కలగక మానదు. భౌతిక సంపదలు, హోదాలు మనల్ని తాత్కాలికంగా సంతోషపెట్టవచ్చు, కానీ అంతిమంగా అవి మన ఆత్మకు శాంతిని ఇవ్వలేవు. ఈ చిన్న మజిలీలో మనం ఏం మోసుకెళ్తాం? సంపదనా, పదవులనా? కాదు. మనం మోసుకెళ్ళేవి కలలు, మనం సాధించిన కీర్తి, మనం విడిచిపెట్టిన ముద్రలు. కలలను మళ్ళీ మళ్ళీ మోయగలిగే శక్తి ప్రతి మనిషిలో ఉంటుంది, కానీ దానిని గుర్తించే ధైర్యం కొందరికే ఉంటుంది. ప్రతిసారి పడిపోయినా, మళ్ళీ లేచి కలను భుజాన వేసుకుని నడవడమే నిజమైన జీవన కళ. ఈ లోకంలో విజయం సాధించినవారి చరిత్రలను పరిశీలిస్తే, వారందరిలో ఉమ్మడిగా కనిపించే ఒక్క లక్షణం పదే పదే విఫలమైనా కలను వదలకపోవడం. విఫలమవ్వడం అనేది ఒక నేరం కాదు, కానీ ప్రయత్నాన్ని ఆపేయడం కచ్చితంగా ఒక ఓటమి అవుతుంది. కల చనిపోతే మనిషి బతికే ఉన్నా చచ్చిపోయినట్టే అని పెద్దలు చెప్పే మాటల వెనుక ఉన్న అంతరార్థం ఇదే. ఆశావహ దృక్పథం ఎప్పుడూ మనిషిని ముందుకు నడిపిస్తుంది. ఇక గమ్యం అంటే ఏమిటి? గమ్యం అనేది భౌతికమైన ఒక స్థలం కాదు అది మన ఊహల్లో పుట్టిన ఒక భావన. మనం ఎలా ఊహించుకుంటామో, గమ్యం అలానే ఆకారం దాలుస్తుంది. ఊహ లేనివాడికి గమ్యం లేదు, గమ్యం లేనివాడికి దిశ లేదు. కానీ గమ్యాన్ని చేరుకోవడం కంటే, దానివైపు సాగే శోధనే నిజమైన జీవన సారాంశం. ప్రతి అన్వేషణలోనూ, ప్రతి ప్రశ్నలోనూ, ప్రతి పరీక్షలోనూ మనిషి తనను తాను తెలుసుకుంటాడు. గమనం అంటే కేవలం ముందుకు కదలడం కాదు అది నిరంతర ఆత్మశోధన. అందుకే ప్రయాణమే ప్రాణం అని చెప్పడం అతిశయోక్తి కాదు. గెలుపు వచ్చినా, ప్రతి మలుపులో ఎదురయ్యే సవాళ్ళు వచ్చినా, ఈ ప్రయాణాన్ని ప్రేమించగలిగేవాడే నిజమైన విజేత. గెలుపు అనేది ఒక క్షణం మాత్రమే, కానీ ప్రయాణం అనేది జీవితమంతా వ్యాపించి ఉంటుంది. ప్రతి అడుగులోనూ మనకు తెలియని కొత్త విషయాలు నేర్చుకుంటాం, కొత్త పరిచయాలు ఏర్పడతాయి, కొత్త అనుభవాలు మన మనసును మరింత పరిపక్వం చేస్తాయి. మన దైనందిన జీవితంలో మనం తరచూ మర్చిపోయే ఒక ముఖ్యమైన సత్యం ప్రతిరోజూ ఉగాదే. తెలుగువారికి ఉగాది అంటే కేవలం ఒక పండుగ కాదు, అది కొత్త సంవత్సరానికి నాంది, కొత్త ఆశలకు నాంది, కొత్త ప్రారంభానికి సంకేతం. ఏడాదికి ఒక్కసారే వచ్చే ఉగాదిని మనం పండుగలా జరుపుకుంటాం, కానీ నిజానికి ప్రతి ఉదయం మనకు అలాంటి అవకాశాన్నే ఇస్తుంది. నిన్నటి తప్పులను, నిన్నటి భారాలను వదిలేసి, ఈ రోజు కొత్తగా ప్రారంభించే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉంది.

ఉదయపు సూర్యకిరణం (ఉషస్సు) మనలో నిండితే, ప్రతి రోజూ ఒక కొత్త వసంతమే. ఈ దృక్పథాన్ని అలవర్చుకున్నవారు జీవితంలో ఎప్పుడూ నిరాశకు లోను కారు, ఎందుకంటే వారికి ప్రతి తెల్లవారుజామూ ఒక కొత్త అవకాశం. ఆశల పల్లకిలో కొత్త కలలను ఊరేగించడానికి, పాత గాయాలను మర్చిపోవడానికి ప్రతి ఉదయం ఒక అద్భుతమైన వేదికగా మారుతుంది. చివరిగా, ప్రతిభ గురించి మాట్లాడుకోవాలి. ప్రతి మనిషిలో ఏదో ఒక ప్రత్యేకమైన శక్తి దాగి ఉంటుంది. దానిని గుర్తించి, సానబెట్టి, ప్రపంచానికి చూపించగలిగినప్పుడు మాత్రమే అది ప్రభంజనంగా మారుతుంది. ప్రతిభ ఉన్నా, దానిని బయటకు తీయకపోతే అది నిద్రాణమైన అగ్నిపర్వతంలా మిగిలిపోతుంది. కానీ ఆత్మవిశ్వాసంతో, పట్టుదలతో ముందుకు సాగినప్పుడు, ఆ ప్రతిభ ఒక తుఫానులా చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కదిలిస్తుంది, మార్పు తీసుకువస్తుంది, స్ఫూర్తినిస్తుంది. మనలో ఉన్న ప్రత్యేకతను మనం గుర్తించకపోతే, ఈ ప్రపంచం మనల్ని గుర్తించదు. సవాళ్లు ఎదురైనప్పుడే మనలోని అసలైన ప్రతిభ బయటకు వస్తుంది. కష్టాలు మనల్ని కుంగదీయడానికి కాకుండా, మనలోని శక్తులను మేల్కొల్పడానికే వస్తాయని మనం నమ్మాలి. మొత్తంగా చూస్తే, ఈ భావాల సమాహారం మనకు చెప్పే పాఠం ఒక్కటే జీవితం క్షణభంగురమైనది, కానీ ఆ క్షణాలను నింపే కలలు, ప్రయాణాలు, ప్రతిరోజూ లభించే కొత్త అవకాశాలు, మనలో దాగిన ప్రతిభ ఇవన్నీ శాశ్వతమైన విలువలు. ఈ చిన్న మజిలీలో మనం ఎంత దూరం నడిచామన్నది కాదు ముఖ్యం, ఎంత హృదయపూర్వకంగా నడిచామన్నదే ముఖ్యం. గమ్యం చేరుకోవడం ఒక ఫలితం మాత్రమే, కానీ ఆ దారిలో మనం ఎదిగిన తీరు, మనం నేర్చుకున్న పాఠాలు, మనం ఇచ్చిన స్ఫూర్తి ఇవే నిజమైన సంపద. అందుకే, ఈ రోజు నుండే మొదలుపెడదాం ప్రతి ఉదయాన్ని ఉగాదిలా స్వాగతిద్దాం, ప్రతి అడుగునూ ఒక నూతన శోధనగా భావిద్దాం, మన కలలను మళ్ళీ మళ్ళీ భుజాన మోసే ధైర్యాన్ని కూడగట్టుకుందాం. అప్పుడే ఈ చిన్న జీవిత మజిలీ అర్థవంతంగా, ప్రకాశవంతంగా, స్ఫూర్తిదాయకంగా నిలిచిపోతుంది రేపటి తరాలకు ఒక దారిదీపంలా. మన ఉనికి ఈ సమాజంలో ఒక మంచి మార్పుకు కారణం కావాలి. అప్పుడే మనం జీవించిన జీవితానికి నిజమైన సార్థకత లభిస్తుంది. నిరంతరం ప్రవహించే నదిలా, ఎప్పుడూ ఆగిపోకుండా సాగిపోవడమే జీవన వేదం.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# మూడింటిలో రెండు కార్పొరేషన్లపై గురి

తెలంగాణ రాజకీయాల్లో తదుపరి సమరం హైదరాబాద్ మహానగరం వేదికగా ప్రారంభం కానుంది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం పాత 1955 నాటి యాక్టును రద్దు చేసి పాత గ్రేటర్‌ను మూడు స్వతంత్ర కార్పొరేషన్లుగా విభజించి, డివిజన్ల సంఖ్యను 150 నుండి ఏకంగా 300 కి పెంచి ఎన్నికలు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేస్తోంది. కాంగ్రెస్ వేస్తున్న ఈ త్రిశూల వ్యూహాన్ని తిప్పికొట్టి, హైదరాబాద్‌పై ఎలాగైనా జెండా ఎగరేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ హైకమాండ్ తన వ్యూహాలకు పదును పెట్టింది. ఇందులో భాగంగానే ఇటీవల బీజేపీ నూతన జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన అత్యంత యువ లీడర్ నితిన్ నవీన్ హైదరాబాద్‌లో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా పర్యటించి, రాష్ట్ర కోర్ కమిటీ నేతలకు గట్టి వార్నింగ్ , దిశానిర్దేశం చేసి వెళ్లారు. నితిన్ నవీన్ తన అంతర్గత సమావేశాల్లో రాష్ట్ర నేతలకు అత్యంత స్పష్టమైన సందేశాన్ని ఇచ్చారు. పట్టణ ప్రాంతాలు, ముఖ్యంగా హైదరాబాద్ వంటి కాస్మోపాలిటన్ సిటీలు ఎప్పుడూ బీజేపీకి బలమైన కోటలు. లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ చుట్టుపక్కల ఎంపీ స్థానాలు గెలిచినంత మాత్రాన సరిపోదు.. ఈ మూడు కార్పొరేషన్ల ఎన్నికల్లో మన సత్తా చాటకపోతే, తెలంగాణలో అధికారం చేపడతామనే బీజేపీ కల భవిష్యత్తులో కేవలం కలగానే మిగిలిపోతుంది అని ఆయన కుండబద్దలు కొట్టారు. నేతల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కనబెట్టి, కలిసికట్టుగా పోరాడకపోతే జరిగే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. గ్రేటర్‌ను విభజించడం వెనుక కాంగ్రెస్ పొలిటికల్ స్కెచ్ ఉంది. ఓల్డ్ సిటీ పరిధిలోని హైదరాబాద్ , ఐటీ కారిడార్ ఉన్న సైబరాబాద్ , ఉద్యోగులు-మధ్యతరగతి ఎక్కువగా ఉండే మల్కాజ్‌గిరి .. ఈ మూడింటికీ వేర్వేరు వ్యూహాలు కావాలని నితిన్ నవీన్ స్పష్టం చేశారు. రాష్ట్ర బీజేపీ నేతలకు ఇవి కేవలం మున్సిపల్ ఎన్నికలు కావు.. వారి సొంత రాజకీయ భవిష్యత్తును, ఉనికిని చాటుకోవడానికి ఒక అగ్నిపరీక్ష.



అందుకే జాతీయ అధ్యక్షుడి పర్యటన ముగిసిన వెంటనే తెలంగాణ బీజేపీ నేతలంతా గ్రేటర్ మున్సిపల్ పరిధిపై అంతర్గత కసరత్తు తీవ్రం చేశారు. గత 2020 జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీ ఏకంగా 48 స్థానాలు గెలుచుకుని బీఆర్ఎస్ గుండెల్లో రైళ్లు పరిగెత్తించింది. ఇప్పుడు బీఆర్ఎస్ బాగా బలహీనపడిన తరుణంలో.. ఆ ఓటు బ్యాంక్ కాంగ్రెస్ వైపు వెళ్లకుండా పూర్తిగా తమ వైపు తిప్పుకోవడమే బీజేపీ ముందున్న అసలైన టాస్క్. కొత్తగా ఏర్పడిన సైబరాబాద్ , మల్కాజ్‌గిరి కార్పొరేషన్ల పరిధిలో ఐటీ ఉద్యోగులు, వలస ప్రజలు, ఇతర రాష్ట్రాల ఓటర్లు అత్యధికంగా ఉన్నారు. ఈ సెగ్మెంట్ సాంప్రదాయకంగా ప్రధాని మోదీ నాయకత్వాన్ని ఇష్టపడుతుంది కాబట్టి, ఇక్కడ క్షేత్రస్థాయిలో సరైన అభ్యర్థులను నిలబెడితే మేజర్‌గా లాభపడొచ్చని బీజేపీ భావిస్తోంది. ఇటు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సంక్షేమ పథకాలు, మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు బూచీని చూపిస్తూ గ్రేటర్ ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తోంది. ఈ తరుణంలో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ, మూడు కార్పొరేషన్ల పరిధిలోని 300 డివిజన్లలోనూ బూత్ స్థాయి కమిటీలను పటిష్టం చేసే పనిలో బీజేపీ శ్రేణులు నిమగ్నమయ్యాయి. ఈ త్రిముఖ కార్పొరేషన్ పోరు తెలంగాణ భవిష్యత్తు రాజకీయ గమనాన్ని మార్చనుంది. కాంగ్రెస్ అధికార బలాన్ని, వ్యూహాలను తట్టుకుని నిలబడాలంటే బీజేపీ కేవలం సోషల్ మీడియా పాలిటిక్స్ నమ్ముకుంటే సరిపోదు.. క్షేత్రస్థాయిలో రోడ్ల పైకి వచ్చి పోరాడాల్సి ఉంటుంది. జాతీయ నాయకత్వం పంపిన అల్టిమేటంతో అప్రమత్తమైన తెలంగాణ బీజేపీ లీడర్లు.. ఈ ఎన్నికలను జీవన్మరణ సమస్యగా భావించి సరికొత్త కార్యాచరణతో ముందుకు కదులుతున్నారు. ఒకవేళ ఈ మూడు స్థానాల్లో బీజేపీ మెజారిటీ సాధిస్తే.. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం తామేనని నిరూపించుకునే గోల్డెన్ ఛాన్స్ దక్కుతుందని పొలిటికల్ ఎక్స్‌పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు.

క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
సోమవారం 13-7-2026


# వసంతనగర్ డివిజన్ డ్రీమ్ వ్యూ కాలనీలో బండి రమేష్ గారి పాదయాత్ర

## సమస్యల పరిష్కారానికి త్వరితగతిన పూర్తి చేస్తానని హామీ ఇచ్చిన బండి రమేష్




**కూకట్ పల్లి, జూలై 12 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ వసంతనగర్ డివిజన్ పరిధిలోని డ్రీమ్ వ్యూ కాలనీలో ఆదివారం ప్రత్యేక పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు మాకినేని వినోద్ (యాకనారాయణ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బండి రమేష్ స్థానిక ప్రజలను కలిసి, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీ ప్రెసిడెంట్ రవి విచ్చేసిన అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించి, గౌరవపూర్వకంగా స్వాగతం పలికారు.

**కాలనీవాసుల సమస్యలు నాయకుల స్పందన**

పాదయాత్రలో భాగంగా కాలనీవాసులు తమ పరిధిలోని పలు సమస్యలను బండి రమేష్ దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నో సంవత్సరాలుగా ప్రధాన డ్రైనేజ్ వ్యవస్థ సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. అనేక ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్లు లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రయాణించడానికి మహిళలు, వృద్ధులు అసౌకర్యానికి గురవుతున్నారని వివరించారు. అంతర్గత రహదారులు పూర్తిగా దెబ్బతిని, ప్రయాణానికి వీలు లేకుండా తయారయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.కాలనీవాసుల సమస్యలను ఎంతో ఓర్పుగా విన్న బండి రమేష్ సానుకూలంగా స్పందిస్తూ... ప్రధాన డ్రైనేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించేందుకు సంబంధిత అధికారులతో తక్షణమే సమన్వయం చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే, అవసరమైన చోట్ల వీధి దీపాలను ఏర్పాటు చేయించి, దెబ్బతిన్న అంతర్గత రోడ్ల నిర్మాణ పనులను కూడా త్వరితగతిన ప్రారంభించేలా ప్రత్యేక కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మాకినేని వినోద్ (యాకనారాయణ) మాట్లాడుతూ డ్రీమ్ వ్యూ కాలనీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని మేము తప్పకుండా నెరవేరుస్తాం. ఈ సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు కాలనీవాసులకు తోడుగా ఉంటాం. అవసరమైతే మళ్లీ పాదయాత్ర నిర్వహించి, ఇక్కడి పనుల పురోగతిని స్వయంగా పరిశీలిస్తామని అన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య వచ్చినా మమ్మల్ని నేరుగా సంప్రదించవచ్చని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తాం," అని వినమ్రంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డ్రీమ్ వ్యూ కాలనీలో ఎంతో ఉత్సాహంగా సాగిన ఈ పాదయాత్రలో నాయకులు తూము వేణు, శ్రీనివాస్ బాబు, గాలి బాలాజీ, దినేష్ కుమార్, రంగమోహన్, గోపాల్ చౌదరి, చావా శ్రీనివాస్, శివ చౌదరి, సంధ్య, రజిత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, మహిళలు, యువకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# గాయత్రి నగర్ డివిజన్‌లో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం విజయవంతం

## ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు

**కూకట్ పల్లి, జూలై 12 (క్రైమ్ మిర్రర్) :** కూకట్‌పల్లి నియోజకవర్గంలోని గాయత్రి నగర్ డివిజన్ పరిధిలో తులసి నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు అంకిత్ సింగ్ ఠాకూర్ ఆధ్వర్యంలో మెడికవర్ హాస్పిటల్స్ వైద్య బృందం సహకారంతో నిర్వహించిన ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు శిబిరాన్ని సందర్శించి వైద్యుల ద్వారా అందిస్తున్న సేవలను పరిశీలించారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, ఆరోగ్య పరీక్షలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రజల సంక్షేమం కోసం సేవాభావంతో ముందుకు వస్తున్న నిర్వాహకులను, వైద్య బృందాన్ని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు పులిగోల్ల శ్రీనివాస్ యాదవ్, అల్లాపూర్ డివిజన్ మాజీ అధ్యక్షులు విజయ్, డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు, తులసి నగర్ సంక్షేమ సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కలెక్టరేట్ ఎదుట నేడు టీడబ్ల్యూజేఎఫ్ నిరసన

### అర్హులైన జర్నలిస్టులకు సరిపడా అక్రిడిటేషన్ లు ఇవ్వాలి

### ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, సమస్యలన్నీ పరిష్కరించాలి

### జర్నలిస్టులు భారీగా తరలిరండి : జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఖదీర్, శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (హెచ్ - 2843) ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ ఎదుట సోమవారం చేపట్టే నిరసనను విజయవంతం చేయాల్సిందిగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అర్హులైన జర్నలిస్టులకు సరిపడా అక్రిడిటేషన్ లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొద్దిమందికి మాత్రమే అక్రిడిటేషన్ ల జారీ సరికాదని తెలిపారు. జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సు పాసులతో పాటు కొత్త మెట్రో పాసులను ఉచితంగా జారీచేయాలని కోరారు. ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఇతర సమస్యలన్నీ పరిష్కారించాలని డిమాండ్ చేశారు. ఈనెల 4న రాష్ట్ర కార్యవర్గ సమావేశం చేసిన తీర్మానాలకు అనుగుణంగా నేటి ఉదయం 11 గంటల నుంచి కలెక్టరేట్ వద్ద నిరసన తెలపాలని పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంతో పాటు మండలాల నుంచి కూడా పెద్ద ఎత్తున జర్నలిస్టులు తరలాల్సిందిగా కోరారు.

# పురాతనమైన బావిని మూసి కడతున్న అక్రమ బిల్డింగ్ ను ఆపండి - వై విక్రమ్

## నగరంలో అక్రమాల కట్టడాలపై చోద్యం చూస్తున్న కార్పొరేషన్ అధికారులు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఖమ్మం నగరంలో వైరా రోడ్ కిమ్స్ హాస్పిటల్ పక్కనే బి కే బజార్లోని పురాతనమైన మంచి నీటి బావని మూసివేసి కడుతున్న అక్రమ బిల్డింగ్ ను వెంటనే కూల్చి తిరిగి బావి నీళ్లను ప్రజలకు అందుబాటులోకి తేవాలని సిపిఎం పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం నగరం వైరా రోడ్ నిజాంపేట్ ఏరియా 42వ డివిజన్ పరిధిలోని బికే బజార్ ఎస్ సి కాలనీ కిమ్స్ హాస్పిటల్ వెనుక భాగంలో పురాతన కాలంనాటి మున్సిపల్ బావిని పార్టీ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వై విక్రమ్ మాట్లాడుతూ దాదాపు 50 సంవత్సరాల నుండి బావి నీళ్లను స్థానిక ప్రజలు వాడుతున్నారు అని తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో గత కొంత కాలంగా బావి నీళ్లను వాడక పోవడంతో కొందరు అక్రమార్కులు కళ్ళు కోట్లు విలువచేసే ఆ స్థలంపై పడింది అని ఆరోపించారు. అక్కడ ప్రజలు గత కొన్ని సంవత్సరాలుగా బావిని పునరుద్ధరణ చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి అని చాలా సందర్భాల్లో ప్రజా ప్రతినిధులను విజ్ఞప్తి చేశారు అని పేర్కొన్నారు. తాజాగా బావి స్థలం పక్కన అక్రమంగా బిల్డింగ్ యాజమాన్యం ఏకంగా బావిని మట్టితో పూడ్చి సిమెంట్ తో నేలను చదును చేశారు అని ఆరోపించారు. ఇప్పుడు అక్కడ బావి వుంది అని నమ్మడానికి వీలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు అని ఆరోపించారు. పాత బావి ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి అని తెలిపారు. తక్షణమే కమిషనర్, కార్పొరేషన్ అధికారులు కళ్ళు తెరిచి బావి స్థల పరిశీలన చేసి అక్రమ బిల్డింగ్ కడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. తిరిగి బావిని పునరుద్ధరణ చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి అని డిమాండ్ చేశారు. లేనియెడల ప్రత్యక్ష ఆందోళన కు దిగుతామని వై విక్రమ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జబ్బార్ మీరా సాహెబ్ వన్ టౌన్ కార్యదర్శి ఎస్.కె నాగుల్ మీరా ఐద్వా నగర అధ్యక్షులు భాగం అజిత సిపిఎం నగర నాయకులు కూరపాటి శ్రీనివాస్ జల చిన్న షేక్ పాషా ధనలకోట రవికుమార్ సత్తెనపల్లి రాము ఫిరంగి వాసు శ్రీదర్ పి.వెంకటేశువర్లు సిహెచ్ ఉపేందర్ దగ్గరయ్య తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి పౌరుని ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది

### బిఎల్ఒలతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్ పల్లి, జూలై 12 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గంలోని ప్రతి పౌరుని ఒక హక్కును కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఆదివారం శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని ఆల్విన్ కాలనీ, మియాపూర్, హాఫీజ్ పేట డివిజన్లకు సంబంధించి సర్ ఓటర్ నమోదు ప్రక్రియపై బిఎల్ ఓ లతో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటు హక్కు పై ఏమైనా సందేహాలు ఉన్న ఎడల వారికి అందుబాటులో ఉండి నివృత్తి చేయాల్సిన బాధ్యత తీసుకోవాలని. ఎవరైనా ఓటు నమోదు కోసం ఆఫీసర్లు వారి ఇంటికి వెళ్ళినప్పుడు వారు అందుబాటులో లేని ఎడల తిరిగి మళ్లీ వారికి సంప్రదించి వారి ఓటు హక్కును కూడా కాపాడాల్సిన బాధ్యత చూసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఏమైనా ఇబ్బంది ఉన్న ఎడల తన ను నేరుగా సంప్రదించవచ్చని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎప్పుడూ అందుబాటులోనే ఉంటారని సూచించారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం నాయకులు, బి ఎల్ వో లు పాల్గొన్నారు.

క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను

సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.


సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595

# ఘనంగా ఇన్‌కమ్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్. రాకేష్ జన్మదిన వేడుకలు

## శాలువాతో సన్మానం.. కేక్ కట్.. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపిన రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



**కూకట్ పల్లి, జూలై 12 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇన్‌కమ్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్. రాకేష్ జన్మదిన వేడుకలు ఆత్మీయ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు రాకేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేసి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ, తమ ఆత్మీయ మిత్రుడు వెంకట రాజు కుమారుడు, ఇన్‌కమ్ ట్యాక్స్ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్. రాకేష్ ఉన్నత పదవిలో ఉండి సమాజానికి ఆదర్శంగా నిలుస్తుండటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాకేష్ తన జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. అలాగే వెంకట రాజు కి, వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియ జేస్తూ, ఇలాంటి శుభసందర్భాలు వారి కుటుంబంలో మరెన్నో జరగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జి. ప్రసాద్, సూర్యనారాయణ, నర్సింగ్ రావు, శ్రీధర్, రవి తదితరులు పాల్గొని రాకేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమం ఆత్మీయత, ఆనందోత్సాహాల మధ్య ఘనంగా ముగిసింది.

క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు



# మూడవ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభలో
# కవయిత్రి బి లక్ష్మీనరసమ్మ కి పురస్కారం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** మూడవ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభలు 2026 జూలై 11,12 శని ఆదివారాలలో యుద్దనపూడి సులోచనారాణి సభా ప్రాంగణం కేబీఎన్ కళాశాల ఆవరణ కొత్తపేట విజయవాడ లో నిర్వహించారు ఖమ్మం కు చెందిన కవయిత్రి బుక్కా లక్ష్మీనరసమ్మ ఆమె కవిత శీర్షిక ఆరాధ్య దైవం కి విశిష్ట పురస్కారం లభించింది.



**నిమ్మకూరులో జన్మించి నిరుపేదల అభివృద్ధికి కృషిచేసినవాడు**

విభిన్న పాత్రలను అవలీలలుగా పోషించి సినీ వినీలాకాశంలో ధ్రువతారయై నిలిచినవాడు పేదవాడి అభ్యున్నతకై తెలుగుదేశం పార్టీని స్థాపించి అనతి కాలంలోనే ముఖ్యమంత్రి అయినాడు తెలుగు భాష ఔనత్యాన్ని తెలుగు ప్రజల ఆత్మాభిమానాన్ని విశ్వవ్యాపితం చేసిన వాడు రామునిగా శ్రీకృష్ణునిగా పాత్రధారణ గావించి భక్తుల హృదయాలలో దేవునిగా కొలువైనవాడు ఆడ పడుచులకు అండగా ఆస్తి హక్కులు ప్రసాదించి వారి హృదయాలలో అన్నగా నిలిచినవాడు. సామాన్యుడిగా మొదలై అసామాన్యుడిగా ఎదిగిన యుగ పురుషుడు నందమూరి తారక రామారావు. సమాజమే దేవాలయం అన్న నినాదంతో పేదల సంక్షేమం మహిళల అభ్యున్నతి కోసం అహర్నిసలు తపించారు. తెలుగు కీర్తి తెలుగు టీవీ తెలుగు జాతి ఆత్మగౌరవం సామాజిక న్యాయం ప్రజాస్వామ్య విలువల కోసం ఆయన చేసిన పోరు చిరస్మరనియం తన నటన చాతుర్యంతో ఆ బాల గోపాలాన్ని అలరించి ఆశేష జనావళి ప్రశంసలందుకొని భువి నుంచి దివికేగిన మా అన్న ఓ రామన్న అందుకో మా ఘన నివాళులు అందించు మాకు నీ ఆశీస్సులు...!! సాహిత్యమంటే అక్షరాల 'కూర్పు నేర్పు'మాత్రమే కాదు, సమాజ హృదయ స్పందనల సజీవ నాదం. ఆ నాదానికి స్త్రీ స్వరం జత కలిసిన వేళ అది మరింత మానవీయతను మరింత సౌందర్యాన్ని సంతరించుకుంటుంది. కుటుంబ సంస్కృతుల సంరక్షకులుగా భాషా పరంపరకు జీవనాను భావాలను అక్షర దీపాలుగా వెలిగించే సృజన శీలురని తెలుగు రచయిత్రులు సాహిత్య ప్రపంచంలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకున్నారని బి లక్ష్మి నరసమ్మ అన్నారు. తెలుగు రచయితలు అందరిని ఒక వేదికపైకి చేర్చే యత్నంలో భాగంగా 2026 జూలై 11 12 తేదీలలో విజయవాడ కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో మూడవ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభలు అద్భుతంగా జరగటం నాకు ఎంతో ఆనందదాయకంగా ఉన్నదని వారు అన్నారు. అహ్లాదకరమైన స్వరాలన్నింటిని ఒకచోట చేర్చి ఆలోచనలకు ఆకారమిచ్చే వేడుకగా మదనమై అనేకమై మేలుకొలుపై సాగే బృంద గానంగా రూపొందించడం నాకు చాలా సంతోషాన్ని కలిగించిందని వారు అన్నారు. ఒక రచయిత్రి కలంలో వెలసిన భావం మరొక హృదయంలో కొత్త వెలుగుతో రగిలించ గలదు. ఒక ఆలోచన ఎన్నో జీవితాలను ప్రభావితం చేయగల దు. అలాంటిది 1000 మంది కవయిత్రులు ఒకే వేదికపై కలిసి అనుభవాలను ఆశయాలను ఆలోచనలను పంచుకున్నప్పుడు సాహిత్యానికే కాదు సమాజానికి కొత్త దిశలు ఆవిష్కృతమవుతాయని వారు అన్నారు. కవిత శీర్షికను వేదిక మీద చదివి వినిపించిన తర్వాత మూడవ అంతర్జాతీయ తెలుగు రచయిత్రుల మహాసభల అధ్యక్ష కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జివి పూర్ణ చందు గౌరవ అధ్యక్షులు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్మహాసభల ప్రధాన బాధ్యులు యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్ని దేశాలు అన్ని రాష్ట్రాలు నుండి వచ్చిన నిర్వాహకులు ఈ సభలో పాల్గొన్నారు. పురస్కార గ్రహీత బి లక్ష్మీ నరసమ్మ పురస్కారం పొందినందుకు ఖమ్మం కవులు రచయితలు మేధావులు ప్రజాసంఘాలు మహిళా సంఘాలు ఇంకా మీరు ఎన్నోసభలలో పాల్గొని మంచి కీర్తి సాధించాలని మనసారా కోరుకుంటున్నామని తెలిపారు.



# మూసాపేట్ జనతా నగర్‌లో
# సర్ ప్రక్రియ పరిశీలన..
## ప్రతి ఓటరు పేరు నమోదు చేసుకోవాలి
## మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్

కూకట్ పల్లి, జూలై 12 (క్రైమ్ మిర్రర్) : కూకట్ పల్లి నియోజకవర్గం, మూసా పేట సర్కిల్ మూసాపేట్ డివిజన్ పరిధిలోని జనతా నగర్‌లో గల శ్రీ రామ యూత్ అసోసియేషన్ వీధిలో కొనసాగుతున్న సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను బీఆర్ఎస్ పార్టీ బూత్ లెవల్ ఏజెంట్లు తో కలిసి మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియ తీరును క్షుణ్ణంగా పరిశీలించిన తూము శ్రావణ్ కుమార్, స్థానిక ప్రజలతో మాట్లాడి సర్ కార్యక్రమం ఉద్దేశ్యాన్ని వివరించారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ ప్రత్యేక ప్రక్రియలో అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే నమోదైన వారు తమ వివరాలు సరిగా ఉన్నాయో లేదో ఒకసారి పరిశీలించుకోవాలని సూచించారు. ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్న ఆయన, ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన పత్రాలతో సంబంధిత అధికారులను సంప్రదించి నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా బిఎల్వోల సహకారంతో వాటిని నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గోపాల్, తుకారాం, జైరాజ్, రాజు, అరుణ్, అర్జున్, కృష్ణ, రమేష్, గోవింద్ తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని సర్ ప్రక్రియను పరిశీలిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానికులు కూడా ఆసక్తిగా పాల్గొని తమ ఓటరు నమోదుకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు.

# మునుగోడు వాసవి క్లబ్ అధ్యక్షులుగా పల్లెర్ల శ్రీకాంత్





**మునుగోడు క్రైమ్ మిర్రర్:** మునుగోడు మండల కేంద్రంలోని ఏం ఎస్ ఆర్ బంక్వెట్ హాల్ లో వాసవి క్లబ్ మునుగోడు సమావేశం ఏర్పాటు చేసి క్లబ్ నూతన కమిటీ ఎన్నుకొన్నారు.అధ్యక్షులుగా పల్లెర్ల శ్రీకాంత్ నియమితులయ్యారు.ఉపాధ్యక్షులుగా, గజ్జల నాగేష్, ప్రధాన కార్యదర్శిగా పామునిగుండ్ల నవీన్ కుమార్,,కోశాధికారిగా నీలా వెంకన్న,గౌరవ అధ్యక్షులుగా యడవల్లి సురేష్ కుమార్ లు ఎన్నికయ్యారు.గవర్నర్ డాక్టర్ అల్లారి పరమేశ్వర్,ముక్య అతిథి మార్యల చంద్రమౌళి గుప్తా లు నూతనంగా ఎన్నికయిన కమిటీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.అధ్యక్షులు పల్లెర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో అధ్యక్ష పదవి బాధ్యతలు అప్పుచెప్పినందుకు ,క్లబ్ అభివృద్ధికి పాటపడుతూ, అందరినీ కలుపుకొని ముందుకు వెళ్తు సేవ కార్యక్రమాలు చేస్తాము అన్నారు. క్యాబినెట్ సెక్రటరీ విజయలక్ష్మి, రీజినల్ ఛైర్పర్సన్ బాలమణి,గజ్జల కిషన్,తడకమళ్ళ బిక్షం,వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# కొండాపూర్‌లో గుర్తుతెలియని మృతదేహం



**మాదాపూర్ క్రైమ్ మిర్రర్ :** మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని మగ వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొండాపూర్‌లోని ప్రెస్టీజ్ ఐవీ అపార్ట్‌మెంట్స్ ఎదురుగా, కొత్తగూడ నుంచి గూగుల్ కార్యాలయానికి వెళ్లే రహదారిపై సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. మృతుడు నీలం రంగు టీషర్ట్, నలుపు రంగు షార్ట్స్ ధరించి ఉండగా, నలుపు రంగు జుట్టు కలిగి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై మాదాపూర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి, మృతదేహాన్ని తదుపరి చర్యల నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి గుర్తింపు, కుటుంబ సభ్యుల వివరాల కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు మాదాపూర్ పోలీస్‌స్టేషన్ సెల్ నంబరు 8712663109లేదా మాదాపూర్ ఎస్‌హెచ్ఓ డి.కృష్ణమోహన్ సెల్ నంబరు8712663100కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ద్వారానే సకలజనుల సమస్యలకు పరిష్కారం: పలువురు వక్తలు



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** దేశంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ద్వారానే సకలజనులు సమస్యలకు పరిష్కార మార్గం లభిస్తుందని పలువురు వక్తలు పేర్కొన్నారు ఆదివారం ఉదయం స్థానిక హోటల్ శ్రీధర్ కాన్ఫరెన్స్ హాల్లో తెలంగాణ సర్వజన ఫోరం( టీఎస్ డి ఎఫ్,) ఆధ్వర్యంలో సుదీర్ఘ సమాలోచన చర్చ వేదిక పేరుతో జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు తొలుత మహనీయులైన పలువురు నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు టి ఎస్ డి ఎఫ్ సమన్వయకర్త ఎం సంగమేశ్వర రావు అధ్యక్షతన జరిగిన చర్చ వేదికలో మరో సమన్వయకర్త ధారావత్ ప్రేమ్ చంద్ నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయ స్థితిగతుల కారణంగా ప్రజల ఆకాంక్షలు ఫలితంగా సామాజిక అసమానతలు నిరుద్యోగం అవినీతి తాండవిస్తున్న యని ఆవేదన వ్యక్తం చేశారు ఈ నేపథ్యంలో నైతిక విలువలతో కూడిన ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు పూలే సామాజిక అధ్యయన వేదిక కన్వీనర్ ప్రసాద్ పటేల్ మాట్లాడుతూ రాబోయే కాలంలో మన అందరి లక్ష్యాన్ని ఈ సుదీర్ఘ చర్చా వేదిక నిర్దేశిస్తుంది అన్నారు ఇంకో సమన్వయకర్త సూరి మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశంలో అంతకుముందు బహుజనుల బ్రతుకు పుస్తకాల ఎలాంటి చరిత్ర తో తెలిసిందే అన్నారు నేడు స్వాతంత్రం వచ్చి 79 సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ పరిస్థితిని గమనిస్తుంటే బహుజనులకు నిజంగానే స్వాతంత్ర్యం వచ్చిందా అనే అనుమానాలు కలుగుతున్నాయి అన్నారు లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు భానోత్ బద్రు నాయక్ మాట్లాడుతూ సమాజంలో ఎటువంటి అసమానతలు లేకుండా సామాన్య ప్రజలందరి జీవితాలు మారాలంటే ఎవరి దామాషాను అనుసరించి వారికి తగిన వాటాలు లభించాలని కోరుకునే వాళ్లందరూ ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అవసరాన్ని అవశ్యకతను గుర్తించి ముందుకు రావాలని పిలుపునిచ్చారు వీరనారీ మణుల ఆశయ సాధన సమితి జిల్లా అధ్యక్షురాలు భూక్య ఉపేంద్ర భాయ్ దళిత సంక్షేమ సంఘం నాయకులు నకిరికంటి సంజీవరావు ఎంపీజే జిల్లా అధ్యక్షులు షేక్ కాసిం నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు యలమందల జగదీష్ మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దాసరి శ్రీను ఎస్సీ ఉపకులాల నాయకులు ఆంతోని సురేష్ తదితరులు ప్రసంగించగా ఈ కార్యక్రమంలో గిరిజన జేఏసీ నాయకులు కేశవ నాయక్ రాజేష్ నాయక్ కిషన్ నాయక్ కృష్ణా నాయక్ రవీంద్ర నాయక్ దశరథ నాయక్ రమేష్ నాయక్ నాగేశ్వరరావు నాయక్ అనిల్ నాయక్ వీరన్న నాయక్ బాబురావు నాయక్ రజక సంఘం నాయకులు పగిడిపల్లి నాగేశ్వరరావు వీరభద్రం కోటయ్య రేగళ్ల సీతారాములు బహుజన జేఏసీ నాయకులు వీరప్రసాద్ లక్ష్మణ్ కొమ్ము ప్రసాద్ వెంకటేశ్వర్లు యోనా శేషయ్య సేవలాల్ సేన నాయకులు రాంబాబు నాయక్ నెహ్రూ నాయక్ బంజారా ఉద్యోగ సంఘం నాయకులు శోభన్ నాయక్ ఎల్ హెచ్ పి ఎస్ న్యాయ సలహాదారులు వీరన్న నాయక్ వీరనారీమణుల ఆశయ సాధన సమితి నాయకులు త్రివేణి భవాని జ్యోతి కళావతి లక్ష్మి కల్పన శ్రీదేవి సుధా తదితరులు పాల్గొన్నారు



# ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్

**గండిపేట(క్రైం మిర్రర్):** ఎస్ఐఆర్ ప్రక్రియంలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ పద్మశాలిపురంలో బీఎల్‌వోలతో కలిసి ఓటర్లకు ఆదివారం ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఓటరుకు విధిగా ఎస్ఐఆర్ పత్రాలు పంపిఆణీ చేయాలని, క్షేత్రస్థాయిలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తన దష్టికి తీసుకురావాలని తెలిపారు. అలాగే ఓటర్లకు కూడా ప్రతి ఒక్కరు ఎస్ఐఆర్ ఫారం నింపి దగ్గరలో ఉన్న బిఎల్‌వోలకు అందజేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఇది చాలా అత్యంత ముఖ్యమైన ప్రక్రియ కాబట్టి ప్రతి ఓటరు విధిగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమ్ దాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు ధనంజయ్, సరికొండ వెంకటేష్, టి. ప్రేమ్ గౌడ్, బాస శ్రీనివాస్ నేత, గట్టయ్య, మొగిలి కృష్ణ,నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# మైనర్ బాలికకు డ్రైవింగ్
### హైదరాబాద్ ఎస్ఐపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

గండిపేట(క్రైం మిర్రర్): తమ చిన్నారి మనవరాలికి కారు డ్రైవింగ్ నేర్పించి, ప్రమాదకరంగా వాహనం నడపడానికి అనుమతించిన హైదరాబాద్ సిటీ సబ్-ఇన్‌స్పెక్టర్ పూజారి తిరుపతిపై నార్సింగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం... ఈ నెల 11వ తేదీ సాయంత్రం సుమారు 5:00 గంటల సమయంలో, హైదరాబాద్ సిటీలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న పూజారి తిరుపతి, తన 6ఏ సంవత్సరాల మనవరాలిని గంధంగూడ -- బైరాగిగూడ రోడ్డుపై ఖా07ఖా7450 నంబర్ గల తన వాహనాన్ని నడపడానికి అనుమతించారు. అత్యంత రద్దీగా ఉండే రహదారిపై అంత చిన్న వయసున్న బాలికతో వాహనం నడిపించడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై స్పందించిన నార్సింగి పోలీసులు, మైనర్ బాలికకు వాహనాన్ని ఇచ్చి ప్రమాదకరంగా డ్రైవింగ్ చేయించినందుకు గానూ ఎస్ఐ పూజారి తిరుపతిపై క్రైమ్ నంబర్ 1313/2026 కింద కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారానికి సంబంధించి నార్సింగి స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఆధ్వర్యంలో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

# పద్మశాలిపురంలో ఘనంగా పోచమ్మ తల్లి ఆలయ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన



**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ మండలం పద్మశాలిపురంలో శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి దేవాలయ నూతన శిలామయ ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠాపన మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక పద్మశాలిపురం పెద్దల సమక్షంలో జరిగిన ఈ విశేష పూజా కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాశిగారి యాదగిరి, ఏర్వ సత్యనారాయణ, నరసింహస్వామి, కొంపల్లి జగదీష్, మునగపాటి విష్ణు, నరసింహ, బాలస్వామి, రుద్ర, శివ, వెంకటేష్, బీరు, రాధా కిషన్ మరియు పద్మశాలిపురం బస్తీ పెద్దలు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ప్రజలకు ఎస్ఐఆర్‌పై సందేహాలు లేకుండా చూసేందుకు హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు

**తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జీ తోకల శ్రీనివాస్‌రెడ్డి**

**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ టీఎన్‌జీవోస్ కాలనీ, పద్మశాలిపురం, మధుబన్ కాలనీ, దుర్గనగర్ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ హెల్ప్‌డెస్క్ కార్యక్రమాన్ని స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ పార్టీ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రాలను పరిశీలించి ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, వారి ఓటు హక్కు పరిరక్షించబడేలా 50 మంది వాలంటీర్లను నియమించి ఈ హెల్ప్ డెస్క్ ద్వారా ఉచితంగా సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. హెల్ప్ డెస్క్‌లో ఎన్యూమరేషన్ ఫారాలను సక్రమంగా నింపే విధానం,



2002 నాటి ఓటరు జాబితా(ఎస్ఐఆర్) వివరాల సేకరణ, అవసరమైన పత్రాలపై మార్గదర్శకత్వం, ఓటరు వివరాలకు సంబంధించిన సందేహాల నివత్తి, అలాగే ఓటు తొలగింపుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు సమగ్ర అవగాహన కల్పిస్తున్నామని తెలపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ప్రతి ఓటరు ఈ ఎస్ఐఆర్ హెల్ప్



డెస్క్ సేవలను సద్వినియోగం చేసుకొని, తమ ఓటు హక్కును కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడికే జనార్ధన్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షుడు పాండు యాదవ్, నవర్ మురళిధర్ రెడ్డి, నర్సి రెడ్డి, కొండల్, బుచ్చి రెడ్డి, ఎల్. వి. రెడ్డి, రాజకుమార్, బి. రామకృష్ణ నరసింహ రెడ్డి, బత్కా శ్రీను, తదితరులు పాల్గొనారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్ధానిక ప్రజలు పాల్గొన్నారు.



## శంషాబాద్‌లో ఘనంగా మెడ్ఆరా స్పెషాలిటీ అండ్ వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభం



**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని శంషాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన మెడ్ఆరా స్పెషాలిటీ అండ్ వెల్‌నెస్ క్లినిక్స్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర రెడ్డి, తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు సాంప్రదాయబద్ధంగా రిబ్బన్ కట్ చేసి ఈ నూతన క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ శంషాబాద్ పరిసర ప్రాంత ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని అన్నారు. క్లినిక్‌ను స్థాపించిన డాక్టర్ ఎం. హనుమంత రెడ్డి, డాక్టర్ మేతిని రెడ్డి గార్లకు వారు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఈ సంస్థ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ ఘన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖులు కొనమల దేవేందర్, రాజేందర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మల్ల రెడ్డి, జనార్ధన్, అమరేందర్ రెడ్డి, రాజ్ రెడ్డి మరియు స్థానిక నాయకులు, వైద్య సిబ్బంది తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## పేకాట స్థావరంపై మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల దాడి

**గండిపేట(క్రైం మిర్రర్):** పేకాట స్థావరంపై ఆదివారం మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద నుంచి నగదు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోహన్‌రెడ్డినగర్‌లో గుట్టు చప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న అత్తాపూర్ హసన్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్లా(35) వ్యాపారి, మోహన్‌రెడ్డినగర్‌కు చెందిన దిలీప్‌నాయక్(21) టైలర్, ఎండి ఫిరోజ్(33) కూలీ, జల్‌పల్లికి చెందిన షేక్ అమీర్(29) కూలీలను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితుల వద్ద నుంచి రూ.5,500 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, ఒక పేకాట ముక్కల సెట్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి ఓటరూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఫారాలను పూర్తి చేసి బీఎల్వోలకు అందజేయాలి

గండిపేట(క్రైం మిర్రర్): భారత ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఓటర్లంతా తమకు అందిన ఫారాలను తప్పనిసరిగా పూర్తి చేసి సంబంధిత బీఎల్వో లకు అందజేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు విజ్ఞప్తి చేశారు. మణికొండ డివిజన్ పరిధిలోని మణికొండ క్వార్టర్స్ లో కాంగ్రెస్ పార్టీ నియమించిన బూత్ లెవెల్ ఏజెంట్స్ లతో కలిసి ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, బీఎల్ఏలు కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకున్నారు. ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు సక్రమంగా నమోదై ఉండేందుకు, తప్పుల్లేకుండా చూసుకునేందుకు ఈ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ఎంతో కీలకమని వారు ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ వివరాలను ధృవీకరించుకోవాలని కోరారు. ఓటరు నమోదు లేదా సవరణలకు సంబంధించి ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా స్థానిక బీఎల్వోలను లేదా కాంగ్రెస్ పార్టీ నియమించిన బీఎల్ఏలను సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చని సూచించారు. ఈ ఓటర్ల అవగాహన కార్యక్రమంలో మణికొండ మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కె. రామకృష్ణ రెడ్డి, బుద్ధోలు శ్రీరామ్, నర్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు శ్రవణ్ కుమార్, గంగాధర్, పుల్లారావు, సంతోష్, లక్ష్మి తదితరులు పాల్గొని ఓటర్లకు దిశానిర్దేశం చేశారు.





## మహేశ్వరం శ్రీశైలం ప్రధాన రహదారి పై అడుగడుగున వాహనాల తనిఖీలు...!

**మద్యం సేవించి వాహనాలు నడిపినవారిపై కఠిన చర్యలు తప్పవు...!**

**మద్యం సేవించి వాహనాలు నడిపిన 6 గురి పై కేసునమోదు చేసిన పోలీసులు**




**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్) :** మద్యం సేవించి వాహనాలు నడిపిన 6 గురి పై కేసునమోదు చేసిన మహేశ్వరం ట్రాఫిక్ సి ఐ వెంకటేశ్వర్లు గత వారం రోజుల నుండి తుక్కుగూడ నుండి కందుకూరు వరకు శ్రీశైలం ప్రధాన రహదారి పై రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారే రోడ్డు ప్రమాదాలను గురిచేస్తున్నారు.. ఆదివారం తుక్కుగూడ నుండి కందుకూరు వరకు వాహన తనిఖీలు నిర్వహించారు. కందుకూరు ఎక్స్ రోడ్డు సమీపంలో కందుకూరు ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, మహేశ్వరం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్ల ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహన తనిఖీలలో 6 గురు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు వారిపై కేసునమోదు చేశామన్నారు.ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపిన,ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైనర్లు వాహనం నడిపి పోలీసులకు పట్టుబడితే పూర్తి బాధ్యత తల్లిదండ్రులదే అని తెలిపారబ మైనర్ల కు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు ప్రతి రోజు వాహన తనిఖీలు నిర్వహిస్తామని అన్నారు.ట్రాఫిక్ నిబంధనాలను పాటించండి ప్రాణాలను కాపాడుకోవాలని సూచించారు.

## అమృత కళాక్షేత్రం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన



**గండిపేట(క్రైం మిర్రర్):** కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డినగర్ పోచమ్మ దేవాలయం బీరలింగేశ్వర కళ్యాణమండపంలో అమృత కళాక్షేత్రం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. అమృత కళాక్షేత్రం అధ్యక్షులు వంగ శ్రీనాథ్‌బాబుగౌడ్, కూచిపూడి కళాక్షేత్రం నృత్య ప్రదర్శన గురువు అమతపావనిగౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ హజరైయ్యారు. ఆయన మాట్లాడుతూ అమృత కళాక్షేతద్రం దాదాపుగా రెండు దశాబ్ధాల క్రితం స్థాపించబడిన భారతీయ సంప్రాదయ నృత్య కళ అయిన కూచిపూడిని పరిరక్షించడం ప్రచారం ద్వారా భావితరాలకు అందించడం ఈ అమత కళాక్షేత్ర సంస్థ ప్రధాన లక్ష్యమన్నారు. అమృత కళాక్షేత్రం విద్యార్థులు వారణాసి(కాశీ), జైపూర్(రాజస్థాన్), ఉత్తర కాశీ కోల్‌కత్త మధ్యప్రదేశ్, నాగ్‌పూర్ అలాగే శ్రీశైలం, యాదాద్రి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాలలో నృత్య ప్రదర్శనలు ఇచ్చి విశేష ప్రసంశలు పొందారన్నారు. హైదరాబాద్‌లో అమృత కళాక్షేత్రం శాఖ స్థాపించి మూడు



సంవత్సరాలు పూర్తికాబోతున్న ఈ కాలంలో ఇక్కడి విద్యార్థులు కూడా అనేక ప్రముఖ దేవాలయలో, వినాయక మండపాలలో అదే విధంగా దుర్గామాత మండపాలలో తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్నారన్నారు. ఇప్పటి వరకు హైదరాబాద్ శాఖ ద్వారా 100 మందికి పైగా విద్యార్థులను ప్రతిభవంతులై కళాకారులుగా తీర్చిదిద్దారన్నారు. ఈ భారతీయ సంప్రదాయ నృత్య కళా వైభవాన్ని మరింత విస్తరింపజేయాలని సంకల్పంతో చేస్తున్న కృషి మునుముందు యాతత్ భారతదేశమే కాకుండా ప్రపంచ దేశాల నుంచి గుర్తింపు రావాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సంతుగౌడ్, అక్యాం శ్రీనాథ్, శ్రీశైలం, పూజారి శివ, శేఖర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ను పకడ్బందీగా నిర్వహించాలి..

**ఓటు హక్కు కోల్పోవద్దు..**

**గగన్ పహాడ్ బస్తీలో ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలనలో నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి**

**గండిపేట(క్రైం మిర్రర్):** ఎస్ఐఆర్ ను పకడ్బందీగా నిర్వహించాలని నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి అన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని గగన్ పహాడ్ బస్తీలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఆదివారం నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శీలం తిరుపతిరెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు.ఈ సందర్భంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి ప్రక్రియ పురోగతిని తెలుసుకున్నారు.ఎన్యుమరేషన్ ఫారంను సరైన విధంగా ఎలా నింపాలి,ఓటర్ల వివరాలను ఎలా నమోదు చేయాలి,అలాగే 2002 నాటి ఓటరు జాబితాను ఆధారంగా తీసుకుని వివరాలను సేకరించే విధానం గురించి కార్యకర్తలు,సంబంధిత సిబ్బందికి సమగ్రంగా అవగాహన కల్పించారు.అలాగే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా,ప్రతి అర్హుడి వివరాలు ఖచ్చితంగా నమోదు అయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎస్ఐఆర్ కార్యక్రమం ఎన్నికల ప్రక్రియలో అత్యంత కీలకమైందని,ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని



సద్వినియోగం చేసుకుని అవసరమైన వివరాలను సమర్పించాలని పిలుపునిచ్చారు.ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్‌పై ప్రతి ఒక్కరికి పూర్తి స్థాయిలో అవగహన కల్పిస్తున్నామన్నారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదని పేర్కొన్నారు.ప్రతి అర్హత కలిగిన ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదైన ఉందో లేదో పరిశీలించుకోవడంతో పాటు అవసరమైన సవరణలు చేసుకునేలా అవగహన కలిగి ఉండాలని సూచించారు.ఓటు హక్కును పరిరక్షించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని,ఎస్ఐఆర్ ప్రక్రియన నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరు చురుకుగా పాల్గొని తమ ఓటరు వివరాలను పరిశీలించుకోవాలని శీలం తిరుపతిరెడ్డి సూచించారు. మ్యాపింగ్‌తో సంబంధం లేకుండా ఎన్యుమరేషన్ ఫారాలు పూరించి సమర్పించిన ప్రతి ఓటరును జూలై 31న ప్రచురించే ముసాయిదా ఓటరు జాబితాలో చేరుస్తారని తెలిపారు.ఓటర్ల నుండి ఎస్ఐఆర్ దరఖాస్తులు పంపిణీ,స్వీకరణ చేశామని ఆయన తెలిపారు.ఎన్ని పనులు ఉన్నా పక్కన పెట్టి ప్రతి అర్హత కలిగిన ఓటరు ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొని ఎన్యుమరేషన్ ఫారాన్ని సక్రమంగా పూర్తి చేసి బీఎల్ఓకు అందజేయాలని సూచించారు.ఇలా చేయడం ద్వారా ఓటు హక్కు పరిరక్షించబడుతుందని తెలిపారు.

క్రైమ్ THE మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
8 సోమవారం 13-7-2026



## మణికొండలో పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన ఈఆర్ఓ, జెడ్సీ

### డిజిటలైజేషన్ వేగవంతం చేయాలని ఆదేశం

**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ ఈఆర్ఓ, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి ఆదివారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం పరిశీలనలో భాగంగా వారు ఈ పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా వారు కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించి, బూత్ స్థాయి అధికారులు , సూపర్‌వైజర్లతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా సేకరించాలని, ఓటరు నమోదు ప్రక్రియలో డిజిటలైజేషన్‌ను మరింత మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. అనంతరం స్థానిక ప్రజలతో మాట్లాడి, ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరు సవరణ కార్యక్రమంపై వారి అభిప్రాయాలను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో నార్సింగి డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి, ఏఈఆర్ఓ , అసిస్టెంట్ మున్సిపాలిటీ కమిషనర్లు, ఇతర మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## బాబుల్ రెడ్డి నగర్‌లో ఓటరు ఎన్యూమరేషన్ ఫారాల నమోదు కార్యక్రమం



**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని బాబుల్ రెడ్డి నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ అధికారులు, బి.ఎల్.ఓ లు, బి.ఎల్.ఏ ల ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని మైలార్‌దేవపల్లి డివిజన్ జనరల్ సెక్రటరీ బొడ్డు ఓంప్రకాష్ ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించారు. స్థానిక అర్హులైన ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఫారాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు డి. కృష్ణమూర్తి, బొజ్జపల్లి రమేష్, బట్టా కిరణ్, సునీల్, రమేష్, నరసింహ మరియు స్థానిక బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బాబుల్‌రెడ్డి నగర్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ నమోదు కార్యక్రమం

**గండిపేట్ : ( క్రైమ్ మిర్రర్ ):** కాటేదాన్ డివిజన్ పరిధిలోని బాబుల్‌రెడ్డి నగర్, మార్కండేయ నగర్ ప్రాంతాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా శ్రీ మేధా స్కూల్ ఆవరణలో, గాంధీ విగ్రహం సమీపంలో ఎన్యూమరేషన్ ఫారమ్‌ల నమోదు కార్యక్రమం నిర్వహించారు. బీఎల్ఓ అధికారులు, బీఎల్‌ఏల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అర్హులైన ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకుని ప్రత్యేక సవరణ ప్రక్రియను వినియోగించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు సోమ శ్రీనివాస్ గుప్తా, ఉమ్మడి మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ అధ్యక్షుడు దనంజయ్య, మాజీ అధ్యక్షుడు సిరికొండ వెంకటేష్, కిషోర్, హనుమంత్, మల్లేష్ (పోతురాజ్), సురేష్, జగన్, ఓం ప్రకాష్, ఓరుగంటి మల్లేష్, సోమ సందీప్ గుప్తా, ఏటీ నాగరాజ్, రవి ముదిరాజ్, డి. కృష్ణ, రవి పూజారి, మల్లేష్, ఆకుల శ్రీనివాస్, అస్మా, శోభ, జే. వెంకటయ్యతో పాటు బీఎల్ఓలు, జీహెచ్ఎంసీ అధికారులు, బీఎల్‌ఏలు మరియు స్థానికులు పాల్గొన్నారు.



# తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ అసోసియేషన్ (టాసా) సర్వసభ్య సమావేశంలో కీలక తీర్మానాలు



**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ అగ్రికల్చరల్ సైంటిస్ట్స్ అసోసియేషన్ (టాసా) ఆధ్వర్యంలో ఆదివారం రాజేంద్రనగర్ మానస హిల్స్ లో గల నిర్వాణ హోటల్ లో సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. టాసా అధ్యక్షులు డాక్టర్ పవన్ చంద్రా రెడ్డి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సంఘం గత ఏడాది కాలంలో చేపట్టిన కార్యక్రమాలు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చేసిన కృషి, ప్రభుత్వం, విశ్వవిద్యాలయ యాజమాన్యంతో నిర్వహించిన చర్చలు, సాధించిన విజయాలను వివరిస్తూ ఒక సంవత్సరం కార్యాచరణ నివేదికను సభ ముందుంచి ఆమోదించారు. సభలో ప్రధానంగా ఎం.ఎస్సీ. పీహెచ్‌డీ ఇంక్రిమెంట్లు, పీఆర్సీ బకాయిలు, కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీ ఏ ఎస్), బదిలీ విధానం, మహిళా ఉద్యోగుల శిశు సంరక్షణ సెలవు (చైల్డ్ కేర్ లీవ్ )కు సంబంధించిన ఆడిట్ అభ్యంతరాలు, 2025–26 సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఖాతాల ఆమోదం, 2026 సంవత్సర సభ్యత్వ నమోదు కార్యక్రమం తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సభలో చర్చల అనంతరం ఉద్యోగుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని పలు కీలక తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. పీజీ, పీహెచ్‌డీ అర్హతలు కలిగిన ఉద్యోగులకు మంజూరు చేసిన నాన్–కాంపౌండ్ అడ్వాన్స్ ఇంక్రిమెంట్లపై వచ్చిన ఆడిట్ అభ్యంతరాల పేరుతో పీఆర్సీ బకాయిలు లేదా జీతాల నుంచి ఎలాంటి రికవరీ చేయరాదని, ఈ అంశంపై ప్రభుత్వం నుంచి తగిన స్పష్టత వచ్చే వరకు ప్రతిపాదిత వసూళ్లను నిలిపివేయాలన్నారు . అవసరమైన ప్రభుత్వ ఉత్తర్వులు, వివరణలు పొందేందుకు విశ్వవిద్యాలయం ఒకటి నుండి రెండు సంవత్సరాల గడువు కల్పించాలని తీర్మానించారు. అదేవిధంగా, లికెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీ ఏ ఎస్)లికు సంబంధించిన అన్ని దరఖాస్తులను అధ్యాపకులు దరఖాస్తు చేసిన కాలంలో అమలులో ఉన్న సీ ఏ ఎస్ స్కోర్‌కార్డు, సంబంధిత మార్గదర్శకాల ప్రకారమే పరిశీలించి ఆమోదించాలని సభ డిమాండ్ చేసింది. సంఘం సమర్థవంతంగా పనిచేయడానికి ఎన్నికైన టాసా పదాధికారులను వారి పదవీకాలంలో విశ్వవిద్యాలయ ప్రధాన కార్యాలయంలోనే నియమించే విధంగా సంఘం ఉపనియమాల్లో తగిన సవరణలు చేయాలని కూడా సాధారణ సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. విశ్వవిద్యాలయం విద్యా మండలి ఆమోదించిన బదిలీ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, అన్ని బదిలీలను పారదర్శకంగా చేపట్టాలని, అలాగే బదిలీ చేయబడిన ఉద్యోగులందరికీ బదిలీ ప్రయాణ భత్యం (టీ టీ ఏ) ను ఎటువంటి జాప్యం లేకుండా చెల్లించాలని తీర్మానించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని టీ టీ ఏ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, భవిష్యత్తులో ప్రతి బదిలీకి సంబంధించిన భత్యాలను సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విశ్వవిద్యాలయాన్ని కోరారు. మహిళా ఉద్యోగులకు శిశు సంరక్షణ సెలవు ( చైల్డ్ కేర్ లీవ్ ) విషయంలో ఏర్పడిన ఆడిట్ అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని కూడా సభ నిర్ణయించింది. ఈ సమావేశంలో టాసా అధ్యక్షులు డా. కె. పవన్ చందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డా. సల్లా సౌజన్య, ఉపాధ్యక్షులు డా. జె. కమలాకర్ , సంయుక్త కార్యదర్శి డి. రమేష్, కోశాధికారి డా. పి. ప్రశాంత్, కేంద్ర కార్యవర్గ సభ్యులు, కార్యవర్గ ప్రతినిధులు, వివిధ కళాశాలలు మరియు పరిశోధనా కేంద్రాలకు చెందిన శాస్త్రవేత్తలు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నాయకత్వం ఉద్యోగుల హక్కులు, సంక్షేమం, సేవా భద్రత, విశ్వవిద్యాలయ అభివృద్ధి కోసం టాసా నిరంతరం కట్టుబడి పనిచేస్తుందని, సాధారణ సభలో ఆమోదించిన తీర్మానాలను వెంటనే అమలు చేయాలని విశ్వవిద్యాలయ యాజమాన్యాన్ని కోరింది. కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ ఎం రమేష్, డాక్టర్ అఫిఫా జహాన్ లను నియమిస్తూ సర్వ సభ్య సమావేశం తీర్మానం చేసింది.

# కార్మికుల తరపున పోరాడే సంఘం కష్టజీవుల పెన్నిధి శ్రమజీవుల ఆశా కిరణం ఏఐటీయూసీ

### జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు




**గండిపేట(క్రైం మిర్రర్):** కష్టజీవుల ఆశా కిరణం నిరంతరం శ్రమజీవుల హక్కుల కోసం పోరాడే సంఘం ఏఐటియుసి సంగం మాత్రమే అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు అన్నారు. శంషాబాద్ పట్టణంలో ఏఐటీయూసీ శంషాబాద్ మండల ఐదవ మహాసభ గిలక రాజు అధ్యక్షతన జరిగింది ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా పాల్గొని మహాసభను ప్రారంభించి మాట్లాడారు 1920 లో ఏర్పడిన ఏఐటీయూసీ నాటినుండి నేటి వరకు దేశంలో రాష్ట్రంలో అనేక జిల్లాలో కార్మికుల పక్షాన నిలబడి పెట్టుబడిదారులను ఆనాటి భూస్వాములను రాజులను ఎదిరించి నిలబడి కార్మికులకు సాధించిన సంఘం ఏఐటియుసి అని ఆయన తెలిపారు . పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్ లో తెచ్చి కార్మికుల బ్రతుకులను నాశనం చేస్తున్నారని ఆయన విమర్శించారు. కార్మికులకు సంఘం పెట్టుకునే హక్కు సమ్మె వేసే హక్కు లేకుండా చేసి పారిశ్రామికవేత్తల పాదాల దగ్గర కార్మికుల బ్రతుకులను పెట్టడం దుర్మార్గమని ఆయన దుయ్యబట్టారు. శ్రమజీవుల కష్టార్జితంతో సంపద పోగవుతున్న ఆ సంపద మీద కార్మికులకు హక్కులు లేవని ఏమాత్రం శ్రమ చేయని సోమరిపోతులు పెట్టుబడిదారులు సంపద మీద పెత్తనం చేస్తూ భూమ్మీదనే స్వర్గాన్ని అనుభవిస్తున్నారని ఆయన అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం పోరాడే ఏఐటీయూసీ జెండా పట్టుకుని కార్మికులు ఐక్య ఉద్యమాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మహాసభలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్ రెడ్డి, మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడారు. ఈ మహాసభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్. యాదగిరి, శంషాబాద్ మండలం సిపిఐ కార్యదర్శి నర్రగిరి శీను, నరేష్ నాయక్, ప్రవీణ్ కుమార్ గౌడ్, వెంకటేష్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు .

**మహాసభలో నూతన కమిటీ..**

మండల అధ్యక్షులుగా టి.శ్రీను, ప్రధాన కార్యదర్శి గిలక రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ కుమార్ గౌడ్, ఉప ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షులు రవికుమార్, ఏ శ్రీను, సహాయ కార్యదర్శులు ఏసు, పద్మ, మంజుల కమిటీ సభ్యులు పదిమందితో నూతన కమిటీ ఎన్నికైనట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు తెలిపారు.

# ఈ నెల 15న హైదరాబాద్‌లో జరిగే నిరుద్యోగ ధర్నాను జయప్రదం చేయాలి

### డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొడ్డు మధు

### రాష్ట్రంలోని ఖాళీ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలి



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, నిరుద్యోగ యువత సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరుద్యోగ ధర్నాను జయప్రదం చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఖమ్మం జిల్లా కార్యదర్శి బొడ్డు మధు పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ నేలకొండపల్లి మండల మహాసభ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వేలాది మంది యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఖాళీ పోస్టులను భర్తీ చేయడంతో పాటు నిరుద్యోగ సమస్య పరిష్కారానికి సమగ్ర చర్యలు చేపట్టాలని కోరారు. యువత హక్కుల సాధన కోసం నిర్వహించే ఈ నిరుద్యోగ ధర్నాలో యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) యువత సమస్యల పరిష్కారం కోసం పనిచేసే సంఘమని, యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడం, నిరుద్యోగ సమస్యపై పోరాటం చేయడం, యువత హక్కుల సాధన కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాలు నిర్వహించడం సంఘం ప్రధాన లక్ష్యాలని తెలిపారు. యువతను సంఘటితం చేస్తూ సామాజిక ఆర్థిక రాజకీయ అవగాహన పెంపొందించడం నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాల కోసం కృషి చేయడం సమాజంలోని అసమానతలు, వివక్ష, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం కల్పించడం డీవైఎఫ్ఐ ముఖ్యమైన కార్యక్రమాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం స్పందిస్తూ యువత భవిష్యత్తు కోసం డీవైఎఫ్ఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తుందని తెలిపారు. యువత సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగించాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాలేరు డివిజన్ అధ్యక్షురాలు వనజ రాథోడ్, డీవైఎఫ్ఐ మాజీ సీనియర్ నాయకుడు ఎలమద్ది లెనిన్, మండల అధ్యక్ష కార్యదర్శులు కనతాల వెంకటేశ్వర్లు, రాసాల నవీన్, డివిజన్ కమిటీ సభ్యుడు తుడుం నాగరాజు, మండల కమిటీ సభ్యులు భారత్, వీరబాబు, యువతీ యువకులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.